# సాక్షి నాగర్‌కర్నూల్

శనివారం । 14 । సెప్టెంబర్ । 2024



**ప్రదర్శనశాలపై పట్టింపేది?**
అలంపూర్ పురావస్తుశాలలో విగ్రహాలు, శిలాశాసనాలను దిక్కులేకుండా పడేశారు.

వివరాలు 8లో ▸



**సుఫియాన్ వచ్చేశాడు**
రష్యా- ఉక్రెయిన్ యుద్ధంలో చిక్కుకున్న సుఫియాన్ ఇంటికి క్షేమంగా చేరుకున్నాడు.

వివరాలు 10లో ▸

గరిష్టం/కనిష్టం
34.8 /20.5

**వాతావరణం**
ఆకాశం అప్పుడప్పుడు మేఘావృతమై ఉంటుంది. మోస్తరు నుంచి చిరుజల్లులు కురిసే అవకాశం ఉంది.

## న్యూస్‌రీల్

### యువజనోత్సవాలకు దరఖాస్తుల స్వీకరణ

**నాగర్‌కర్నూల్ రూరల్:** యువజన సర్వీస్ శాఖ ఆధ్వర్యంలో జిల్లాస్థాయి యువజనోత్సవాలు ఈ నెల 28 నుంచి ప్రారంభమవుతాయని, ఇందుకు దరఖాస్తులు చేసుకోవాలని ఆ శాఖ జిల్లా అధికారి సీతారాం శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా స్థాయి సాంకేతిక ఉత్సవాల కింద అనేక అంశాల్లో యువజనులకు పోటీలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. జిల్లాలోని కళాకారులైన యువతీ, యువకులు పోటీల్లో పాల్గొనాలన్నారు. జానపద నృత్యం, వ్యక్తిగత జానపద పాటలు, బృంద జానపద పాటలు, వ్యక్తిగత లైఫ్‌స్కిల్స్ కాంపోనెంట్ కథ రచన, పోస్టర్ మేకింగ్, ఫొటోగ్రఫీ పోటీల్లో సైన్స్ అండ్ టెక్నాలజీ, టెక్స్‌టైల్స్, వ్యవసాయ ఉత్పత్తులలో విజేతలను నిర్ణయించి మొదటి స్థానం పొందిన వారిని రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక చేస్తామన్నారు. పోటీల్లో పాల్గొనే వారు 15- 29 ఏళ్లలోపు జిల్లాకు చెందిన వారై ఉండాలని, ఈ పోటీలు మున్నూరు ఫంక్షన్ హాల్‌లో నిర్వహిస్తామన్నారు. పూర్తి సమాచారం కోసం సెల్ నం.90590 74909ను సంప్రదించాలని సూచించారు.

### బాధ్యతలు స్వీకరించిన మత్స్యశాఖ ఏడీ



**నాగర్‌కర్నూల్:** జిల్లా మత్స్యశాఖ ఏడీ రజని శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఇన్‌చార్జ్ ఏడీగా పనిచేసిన అచ్చంపేట ఎఫ్‌డీఓ రహమాన్ తిరిగి తన స్థానానికి వెళ్లారు. హైదరాబాద్‌లోని కమిషనర్ కార్యాలయంలో పనిచేస్తున్న రజనిని నాగర్‌కర్నూల్‌కు బదిలీ చేయగా ఇక్కడికి వచ్చారు. ఈ మేరకు బాధ్యతలు స్వీకరించిన ఏడీ రజనికి ఆ శాఖ ఉద్యోగులు శుభాకాంక్షలు తెలిపారు.

### వేలంపాట వాయిదా

**ఉప్పునుంతల:** మండలంలోని శ్రీశైలం- హైదరాబాద్ ప్రధాన రహదారి పక్కన వెల్టూరు స్టేజీ వద్ద ప్రతి ఆదివారం జరిగే గొర్రెలు, మేకల సంత వేలం పాట వాయిదా పడింది. శుక్రవారం సంత వేలం పాట నిర్వహించడానికి డీఎల్‌పీఓ వెంకటప్రసాద్, ఎంపీఓ నారాయణ, పంచాయతీ కార్యదర్శి గ్రామ పంచాయతీ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. సంతకు సంబంధించి శాశ్వత స్థలాన్ని సమకూర్చుకున్న తర్వాతే వేలం పాట నిర్వహించాలని గ్రామస్తులు వేలం పాట బహిష్కరించారు. స్థలం సరిగా లేకనే గ్రామ పంచాయతీకి వేలం పాట దక్కించుకున్న వారు డబ్బులు సక్రమంగా చెల్లించకుండా మధ్యలోనే వెళ్లిపోతున్నారని వారు అధికారులకు వివరించారు. స్థలం విషయాన్ని తీర్మానం చేసి జిల్లా పంచాయతీ అధికారికి పంపిస్తామని డీఎల్‌పీఓ చెప్పారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు సంతవేలం పాటపై మరోసారి నిర్ణయం తీసుకోవడం వారు పేర్కొన్నారు.

### నాలుగో విడత ప్రవేశాలు

**మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ:** జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేట్ ఐటీఐలలో ప్రస్తుతం నాలుగో విడత అడ్మిషన్లు జరుగుతున్నాయని జిల్లా నోడల్ ప్రిన్సిపాల్ బి.శాంతయ్య శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 20వ తేదీ వరకు గడువు ఉందని, కొత్తగా దరఖాస్తు చేసుకోదలిచిన విద్యార్థులు iti.telangana.gov.inలో నమోదు చేసుకోవాలని సూచించారు. అనంతరం నేరుగా ప్రవేశం కోరుకునే ఐటీఐకి అన్ని ఒరిజినల్ సర్టిఫికెట్లతో హాజరు కావాలని, ఈ అవకాశాన్ని జిల్లాలోని అర్హులైన విద్యార్థులందరూ సద్వినియోగం చేసుకోవాలని పేర్కొన్నారు.

**శ్రీశైలం ఆనకట్ట గేట్ల మూసివేత** - దోమలపెంట

వివరాలు 8లో ▶

# కబ్జా కోరల్లో..

## అచ్చంపేట పరిధిలో అడుగడుగునా ఆక్రమణల జోరు



మల్లంకుంట ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్‌లో వెలసిన అక్రమ నిర్మాణాలు

- చెరువులు, కుంటల్లో యథేచ్ఛగా అక్రమ నిర్మాణాలు
- ఆనవాళ్లు కోల్పోయిన మల్లంకుంట, గజవానికుంట, కొర్లకుంట
- నాలాలు పూడ్చివేసి నీటి దారి మళ్లింపు
- హైడ్రా తరహాలో దాడులు చేపట్టాలంటున్న స్థానికులు



తుమ్మలకుంటలో నీట మునిగిన సబ్‌స్టేషన్

**అచ్చంపేట:** జిల్లాలో ఒకప్పుడు అపారమైన నీటి వనరులతో జీవకళ ఉట్టిపడిన చెరువులు, కుంటలు ఇప్పుడు కబ్జా కోరల్లో చిక్కుకున్నాయి. వందలాది ఎకరాల భూమి ఆక్రమణకు గురైంది. ఈ కబ్జాల వ్యవహారంలో తప్పెవరిది అంటే.. 'తిలా పాపం.. తలా పిడికెడు' అన్నట్లు పాలకులు, అధికారులు, పేదలు, పెద్దలు ఇలా అందరి భాగస్వామ్యం ఉంది. రెండు, మూడు దశాబ్దాల కిందటి నుంచే చెరువుల్లో అక్రమ లేవుట్లు వేసినా.. అనుమతి లేని నిర్మాణాలు చేపట్టినా.. ఏ ఒక్కరూ పట్టించుకున్న పాపాన పోలేదు. రాజకీయ ఒత్తిళ్లతో అక్రమ నిర్మాణాలపై చర్యలు తీసుకోలేదు. దీంతో రికార్డుల్లో ఉన్న చెరువులు, కుంటలు.. క్షేత్రస్థాయిలో కనుమరుగయ్యాయి. అయితే రాష్ట్ర రాజధానిలో చెరువుల పరిరక్షణకు తీసుకువచ్చిన హైడ్రా వంటి వ్యవస్థ ఏర్పాటు చేసి వాటిని పరిరక్షించాలని జనం కోరుతున్నారు. ఈ క్రమంలోనే మల్లంకుంటలో అక్రమ కట్టడాలను కూల్చివేస్తామని స్థానిక ఎమ్మెల్యే వంశీకృష్ణ చేసిన ప్రకటన ప్రకంపనలు సృష్టిస్తోంది.

**28 ఎకరాల నుంచి..**

అచ్చంపేట పట్టణం మధ్యలో 28 ఎకరాల్లో మల్లంకుంట విస్తరించి ఉన్నట్లు పాత లెక్కలు చెబుతుండగా.. పంచాయతీరాజ్ నుంచి ఇరిగేషన్ శాఖకు బదిలీ చేసిన లెక్కల ప్రకారం 16.20 ఎకరాలు మాత్రమే ఉంది. ఇందులో 6.20 ఎకరాల శిఖం భూమి, సర్వే నం.152లో 14.6 ఎకరాల్లో.. 11 ఎకరాల భూమి ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్‌లో ఉండగా రెవెన్యూ అధికారులు మాత్రం దీని నాన్ అగ్రికల్చర్ భూమిగా మార్చారు. 15 ఏళ్ల క్రితం వరకు పరివాహక ప్రాంతంలో ఎలాంటి నిర్మాణాలు ఉండేవి కావు. ఇప్పుడు మల్లకుంట చుట్టుపక్కల వ్యాపార సముదాయాలు, నివాస భవనాలు వెలిశాయి. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు అచ్చంపేట- శ్రీశైలం ప్రధాన రహదారితోపాటు లోతట్టు ఇళ్లు జలమయమయ్యాయి. మల్లకుంట ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్‌లో అక్రమ కట్టడాల జోరు నిలువరించలేని పరిస్థితి ఇక్కడ ఏర్పడింది. కబ్జాకు గురైనట్లు స్థానికుల నుంచి ఫిర్యాదులు అందిన నేపథ్యంలో మున్సిపల్ శాఖ నుంచి వచ్చి ఆదేశాల మేరకు కొన్ని దుకాణాలను పాక్షికంగా కూల్చివేశారు. ఈ కుంటపై అక్రమార్కుల కన్ను పడుతున్నప్పటికీ రెవెన్యూ అధికారులు మాత్రం నిర్లక్ష్యంగా వ్యవహరించారు. మల్లంకుంటలోకి వచ్చే మురుగు నీటి కాల్వ(నాలా)ను సైతం దారి మళ్లించారు.

**సర్వే చేయిస్తాం..**

మున్సిపల్ శాఖ సహకారంతో మల్లంకుంటను పరిరక్షించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటాం. అవసరమైతే రెవెన్యూ శాఖతో సమన్వయం చేసుకుని ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్ గుర్తించి.. శిఖం భూమిని సర్వే చేయిస్తాం. ఇరిగేషన్ శాఖ నుంచి ఎలాంటి ఎన్‌ఓసీ ఇవ్వలేదు. మేం ఇచ్చిన నివేదిక ఆధారంగానే అక్రమ కట్టడాలను గుర్తించి మున్సిపల్ అధికారులు గతంలో కొన్ని దుకాణాలను కూల్చివేశారు.

– బాలస్వామి, ఇరిగేషన్‌శాఖ డీఈ, అచ్చంపేట

**ఆనవాళ్లు లేని గజవానికుంట**

అచ్చంపేట మున్సిపాలిటీలో ప్రధానంగా రెండు గొలుసుకట్టు చెరువులైన గజవానికుంట, కొర్లకుంట చెరువులు మాయం కావడంతో కాలనీలు జలమయమవుతున్నాయి. ఒకప్పుడు సాగునీటి అవసరాలు తీర్చిన ఈ రెండు చెరువులు.. ప్రస్తుతం పట్టణీకరణ నేపథ్యంలో ఆక్రమణకు గురై ఉనికి కోల్పోయాయి. అచ్చంపేట- ఉప్పునుంతల రోడ్డులోని గజవానికుంట ధ్వంసంపై అప్పట్లో పోలీసు కేసు నమోదు చేసి కొంత మందిని జైలుకు సైతం పంపించారు. ఇప్పుడు ఈ చెరువుల్లో పెద్ద పెద్ద కాలనీలు వెలసి వందలాది కుటుంబాలు నివాసం ఉంటున్నారు. సర్వే నం.345 భూమి వివాదంలో ఉండగానే అనుమతులు లేకుండా నిర్మాణాలు చేపట్టారు. గజవానికుంట ఆక్రమణపై రెవెన్యూ అధికారులు దృష్టిసారించకపోవడంతో మాయమైంది.

**విద్యుత్ సబ్‌స్టేషన్‌తో ముప్పు**

చౌటపల్లి రోడ్డులోని తుమ్మలకుంట శిఖం భూమిలో ఏర్పాటు చేసిన 33/11 కేవీ సబ్‌స్టేషన్ ఇటీవల కురిసిన వర్షాలకు నీట మునిగింది. కేంద్ర ప్రభుత్వ నిధులతో పట్టణానికి ప్రత్యేకంగా ఈ సబ్‌స్టేషన్ నిర్మాణం చేపట్టగా.. కాంట్రాక్టర్ మధ్యలోనే వదిలేశారు. నీటి నిల్వ సామర్థ్యం, బఫర్‌జోన్ వంటివి పరిశీలించకుండా గుడ్డిగా నిర్మించగా.. ప్రస్తుతం వర్షాలతో ఇది బయటపడింది. అయితే బఫర్ జోన్, ఎఫ్‌టీఎల్‌ను పట్టించుకోకుండా అక్రమ నిర్మాణాలు చేపట్టిన ఆక్రమణదారులకు ప్రస్తుతం హైడ్రా తీసుకుంటున్న చర్యలతో ఆందోళన మొదలైంది. అలాగే గతంలో ఇక్కడ పనిచేసిన అధికారులు నిబంధనలకు విరుద్ధంగా అనుమతులు ఇచ్చినందున తమపై ఎలాంటి చర్యలు తీసుకుంటారోనని ఆందోళన చెందుతున్నారు.

**అన్యాక్రాంతమైన శిఖం భూమి..**

కొర్లకుంట శిఖం భూమిని ప్లాట్లుగా అమ్మేశారు. పట్టణంలోని గజవానికుంట కింద గొలుసు కట్టు పరిధిలోని కొర్లకుంట సర్వే నం.351లో రెండున్నర ఎకరాల శిఖం భూమి ఉంది. సుమారు ఎకరా భూమి అన్యాక్రాంతమైంది. శిఖం భూమి ఇతర అవసరాలకు కేటాయించడానికి వీల్లేదు. ఇలాంటి స్థలం పరిరక్షించాల్సిన బాధ్యత రెవెన్యూశాఖపై ఉన్నా పట్టింపు లేని ధోరణితో వ్యవహరిస్తున్నారు. ఈ కుంట ద్వారా వెళ్లే నాలాను ఈ మధ్యకాలంలోనే కొందరు రియల్ ఎస్టేట్ వ్యాపారులు పూడ్చివేసి ప్లాట్లు చేశారు. లింగోటం చెరువులోకి నీరు వెళ్లకుండా అడ్డంగా గోడ నిర్మించారు. ఫలితంగా ఇటీవల కురిసిన వర్షాలకు పాట్లలోకి నీరు చేరింది. నాలాలను పరిరక్షించాల్సిన అధికారులు గుడ్డిగా డీటీసీపీ అనుమతులు ఇవ్వడం సర్వత్రా చర్చనీయాంశమైంది.

❒ ఎర్రకుంటను రియల్టర్ ఏకంగా కూల్చివేస్తున్నారు. ఇరిగేషన్, రెవెన్యూ అధికారుల సమన్వయ లోపంతో కబ్జాదారులు రెచ్చిపోయారు. జన్మభూమి కార్యక్రమంలో పనికి ఆహార పథకం కింద తుమ్మలకుంటకు వెళ్లే నీటి ప్రవాహానికి అడ్డుగా నీటి నిల్వ కోసం అప్పట్లో ఈ కుంట నిర్మించగా.. ఇప్పుడు దీన్ని రియల్టర్లు ఆనవాళ్లు లేకుండా చేశారు.

# విద్యా ప్రమాణాలు మెరుగుపర్చాలి



విద్యార్థులతో మాట్లాడుతున్న కలెక్టర్ బదావత్ సంతోష్

**నాగర్‌కర్నూల్:** విద్యార్థులకు పరిశుభ్రమైన వాతావరణంలో రుచికరమైన మధ్యాహ్న భోజనం అందించాలని కలెక్టర్ బదావత్ సంతోష్ అన్నారు. శుక్రవారం ఆయన మండలంలోని తూడుకుర్తి జెడ్పీహెచ్‌ఎస్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. కలెక్టర్ పాఠశాల మొత్తం కలియదిరిగి విద్యార్థులతో ముచ్చటించారు. విద్యార్థులకు కల్పిస్తున్న వసతులు, పాఠ్య పుస్తకాల, నోట్ బుక్స్ పంపిణీ, విద్యా ప్రమాణాలు, మౌళిక సదుపాయాల గురించి వారిని అడిగి తెలుసుకున్నారు. రానున్న పదో తరగతి పరీక్షల్లో 10/10 జీపీఏ, సాధించేలా విద్యార్థులు మంచిగా చదువుకోవాలని, ఉపాధ్యాయులు సైతం విద్యా మెరుగుపర్చేందుకు కృషి చేయాలన్నారు. విద్యార్థులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా సౌకర్యాలు కల్పించాలన్నారు. మొదటి ప్రాధాన్యతగా శుద్ధజలం అందించాలని, విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా మరుగుదొడ్ల సౌకర్యం కల్పించాలని సూచించారు. టాయిలెట్స్, నల్లాలు, గోడల పగుళ్లు, ఫ్లోరింగ్, పై కప్పు నీరు లీకేజీ వంటివి అమ్మ ఆదర్శ పాఠశాల నిధుల నుంచి అవసరమైన మేరకు మరమ్మతు చేపట్టాలన్నారు. విద్యార్థులతోపాటు క్లాస్ రూంలో టీచర్ బోధన, విద్యార్థులు మననం చేసుకునే విధానాన్ని, భోజన వంటశాల, వంట చేసే విధానాన్ని కలెక్టర్ స్వయంగా పరిశీలించారు.

⇨ శ్రీపురంలో నిర్వహించిన డ్రై డే- ఫ్రై డే కార్యక్రమాన్ని కలెక్టర్ పరిశీలించారు. సీజనల్ వ్యాధులు రాకుండా ముందస్తు జాగ్రత్త తీసుకోవాలని, పారిశుద్ధ్య పనులు క్రమం తప్పకుండా చేపట్టాలని, ఓపెన్ ప్లాట్లు, జనావాసాల మధ్య నీరు నిల్వకుండా చూడాలని చెప్పారు. డెంగీ కేసు నమోదైన ప్రాంతాలపై ప్రత్యేక దృష్టిసారించి నివారణ చర్యలు చేపట్టాలని, పరిస్థితిని ఉన్నతాధికారులకు తెలియజేయాలన్నారు. అనంతరం పల్లె దవాఖానాను పరిశీలించి దవఖానాకు వచ్చే ప్రజల వివరాలను వైద్యుడు రామకృష్ణను అడిగి తెలుసుకున్నారు. ఆయా కార్యక్రమాల్లో ఆరోగ్య శాఖ ప్రోగ్రాం అధికారి శ్రీనివాసులు, ఇమ్యూనైజేషన్ అధికారి రవినాయక్, ఎంపీడీఓ కోటేశ్వర్, రెడ్‌క్రాస్ కార్యదర్శి కుమార్, హెచ్‌ఎం రఘు పాల్గొన్నారు.

# మధ్యాహ్న భోజన బిల్లులు చెల్లించాలి



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న మధ్యాహ్న భోజన కార్మికులు

**నాగర్‌కర్నూల్ రూరల్:** జిల్లావ్యాప్తంగా మధ్యాహ్న భోజన పథకంలో పనిచేస్తున్న కార్మికులకు పెండింగ్‌లో ఉన్న బిల్లులు వెంటనే చెల్లించాలని సీఐటీయూ ఆధ్వర్యంలో శుక్రవారం కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. అనంతరం కలెక్టర్ బదావత్ సంతోష్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సంఘం జిల్లా అధ్యక్షుడు ఆంజనేయులు మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా మధ్యాహ్న భోజన కార్మికులకు 8 నెలల పెండింగ్ బిల్లులు రాక తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని, తక్షణమే పెండింగ్ బిల్లులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ప్రజా ప్రభుత్వం అని చెప్పుకొంటున్న కాంగ్రెస్ మాత్రం కాలం గడుపుతుందన్నారు. పెంచిన నెలవారి వేతనం కూడా సరిగా చెల్లించకుండా 2 గుడ్లకు అదనంగా ఇంకో గుడ్డు పెట్టాలని, అదనపు గుడ్డుకు బడ్జెట్ ఇవ్వకుండా మూడు గుడ్లు పెట్టాలని ఒత్తిడి చేస్తున్నారని, అదేవిధంగా రాగి జావ ఇవ్వాలని సరైన బడ్జెట్ ఇవ్వకుండా ఏ విధంగా ఇస్తారని ప్రశ్నించారు. ప్రభుత్వం కార్మికులకు ఇవ్వాల్సిన పెండింగ్ బిల్లులు ఇవ్వడంతోపాటు నెలకు 18 వేల ఫిక్స్‌డ్ వేతనం చెల్లించాలన్నారు. కార్మికులకు కాటన్ వస్త్రాలు ఇవ్వాలని, ఈఎస్‌ఐ, పీఎఫ్ కల్పించాలని, సబ్సిడీపై రూ.500కే గ్యాస్ సిలిండర్ ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి రామయ్య, ఉపాధ్యక్షుడు మల్లేష్, రైతు సంఘం జిల్లా నాయకులు లక్ష్మణ్, విజయ్‌గౌడ్, వెంకటయ్య, గౌరమ్మ, పార్వతమ్మ, జహీదా, రాములు, గీతారాణి, శ్యామల, అన్నపూర్ణ తదితరులు పాల్గొన్నారు.

# లక్ష్యాన్ని నిర్దేశించుకొని చదువుకోవాలి



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ కూచుకుళ్ల దామోదర్‌రెడ్డి

**తాడూరు:** విద్యార్థులు ఒక లక్ష్యాన్ని నిర్దేశించుకొని.. చదువుపై ప్రత్యేక శ్రద్ధకనబరిచి తల్లిదండ్రులు, గురువుల ఆశయాలు నెరవేర్చే విధంగా ముందుకెళ్లాలని ఎమ్మెల్సీ కూచుకుళ్ల దామోదర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం స్థానిక కూచుకుళ్ల సౌభాగ్య ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఫ్రెషర్స్‌డే నిర్వహించగా.. ఆయన హాజరై మాట్లాడారు. తల్లిదండ్రులు ఎన్నో ఆశలతో పిల్లల చదువుకు నానా ఇబ్బందులు పడతారని, వారి ఆశయాలు నెరవేర్చే విధంగా చెడు అలవాట్లకు దూరంగా ఉండి బాగా చదువుకుని ప్రయోజకులు కావాలన్నారు. కళాశాలకు వచ్చే కొత్త విద్యార్థులు తరగతి గదిలో అధ్యాపకుడు బోధించే పాఠాలపై దృష్టిసారించి ఉన్నత లక్ష్యాలతో ఉత్తీర్ణత సాధించాలన్నారు. ఉమ్మడి జిల్లాలోనే తాడూరు కళాశాలకు ప్రత్యేక పేరు ఉందని.. కళాశాలలోని సమస్యలు పరిష్కరించేందుకు తాను ఎప్పుడూ సిద్ధంగా ఉంటానన్నారు. గురువు, తల్లిదండ్రుల గౌరవ మర్యాదలు కాపాడేలా పిల్లల ప్రవర్తన ఉండాలన్నారు. గతంలో కళాశాల పరిస్థితి ఘోరంగా ఉండేదని అలాంటి కళాశాలకు నిధులు మంజూరు చేసి ప్రహరీతోపాటు కరెంట్, ప్రతి గదికి ఫ్యాన్, లైబ్రరీ వంటి వివిధ అభివృద్ధి పనులు చేపట్టడం జరిగిందన్నారు. సమావేశంలో కళాశాల ప్రిన్సిపల్ వెంకటరమణ, రిటైర్డ్ అటవీ శాఖాధికారి నర్సయ్య, గ్రామస్తులు గోవర్ధన్‌రెడ్డి, రమేష్, మల్లయ్య, నిరంజన్, బుచ్చయ్య, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# రైతులను నిలబెట్టడమే లక్ష్యం




మాట్లాడుతున్న వ్యవసాయ, మార్కెటింగ్ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు, చిత్రంలో మంత్రి జూపల్లి, ఏఐసీసీ కార్యదర్శి సంపత్‌కుమార్, తదితరులు

- వ్యవసాయ మార్కెటింగ్ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు

**అలంపూర్:** రైతులను నిలబెట్టడమే ప్రభుత్వ లక్ష్యం అని రాష్ట్ర వ్యవసాయ మార్కెటింగ్ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు అన్నారు. జోగుళాంబ గద్వాల జిల్లా అలంపూర్ చౌరస్తాలో అలంపూర్ వ్యవసాయ మార్కెట్ యార్డు కమిటీ ప్రమాణ స్వీకారం కార్యక్రమానికి మంత్రి తుమ్మలతోపాటు రాష్ట్ర ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు, కలెక్టర్ సంతోష్, ఏఐసీసీ కార్యదర్శి, మాజీ ఎమ్మెల్యే సంపత్‌కుమార్ హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి తుమ్మల మాట్లాడుతూ జోగుళాంబ అమ్మవారి సాక్షిగా సీఎం రేవంత్‌రెడ్డి రూ.2 లక్షల రుణమాఫీ చేస్తామని చెప్పి నెరవేర్చారన్నారు. రూ.2 లక్షలపైగా ఉన్న రైతులు మిగతా డబ్బులు చెల్లిస్తే ప్రభుత్వం రుణమాఫీగా రూ.2 లక్షలు వాళ్ల ఖాతాల్లో వేస్తామన్నారు. ముందుగా చెప్పినట్లు రూ.31 వేల కోట్లు రైతుల ఖాతాల్లో జమ చేసే వరకు సీఎం రేవంత్‌రెడ్డి ఊరుకోరన్నారు. రుణమాఫీకి కొత్త రూల్ రాలేదని కొత్త సిద్ధాంతం పెట్టలేదన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి మీ జిల్లా బిడ్డ అన్నారు. పాలమూరుకు సీఎం ఇచ్చిన ఘనత కాంగ్రెస్ పార్టీకి సోనియాగాంధీకి దక్కిందన్నారు. ప్రజాపాలనలో ఆర్థిక ఇబ్బందులు, కష్టాలు, ఇతర సమస్యలు ఉన్నా.. రైతన్నలు, నేతన్నలను ప్రభుత్వం రెండు కళ్లగా చూస్తోందన్నారు. ఎకరాకు రూ.7,500 చొప్పున పండించే భూములకు మాత్రమే వేస్తామన్నారు. గతంలో పండని పంటలకు డబ్బులు వేసి నిధులు వృథా చేశారన్నారు. బీఆర్‌ఎస్ నాయకులు రోడ్లపై పడకుంటే.. చిల్లర మాటలు మాట్లాడితే తెల్లారేసరికి అధికారం రాదని, కాంగ్రెస్ పార్టీకి, ప్రభుత్వానికి ఎలాంటి ఇబ్బంది ఉండదన్నారు. మంత్రి జూపల్లి కృష్ణారావు మాట్లాడుతూ తెలంగాణ ఆవిర్భవించినప్పుడు ధనిక రాష్ట్రంగా ఉండగా.. ఏడాదికి రూ.లక్షల కోట్ల ఆదాయం వచ్చే హైదరాబాద్ ఉన్నప్పటికీ గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం పదేళ్లలో రింగు రోడ్లను అమ్మి రైతుబంధు ఇచ్చే పరిస్థితికి తెచ్చిందన్నారు. బీఆర్‌ఎస్ హయాంలో చేసిన రూ.8 లక్షల కోట్ల అప్పులకు కాంగ్రెస్ ప్రభుత్వం ఏడాదికి రూ.60 వేల కోట్లు వడ్డీ చెల్లిస్తోందన్నారు. బీఆర్‌ఎస్ నాయకులు బంగారు పల్లెంలో అధికారం అప్పజెప్పామని చెబుతున్నారని, కానీ బంగారు పల్లెంను తెరిచి చూస్తే రూ.8 లక్షల కోట్ల అప్పు ఉందని ఎద్దేవా చేశారు.

# రేపు సీఎం రేవంత్‌రెడ్డి రాక

- ఎమ్మెల్యే జి.మధుసూదన్‌రెడ్డి తండ్రి దశదినకర్మకు హాజరు
- దమగ్నాపురంలో హెలీప్యాడ్ స్థలాన్ని పరిశీలించిన ఎస్పీ జానకి



దమగ్నాపురంలో పార్కింగ్ పనులు పరిశీలిస్తున్న ఎస్పీ జానకి తదితరులు

**చిన్నచింతకుంట:** సీఎం రేవంత్‌రెడ్డి ఆదివారం దమగ్నాపురం రానున్నారు. దేవరకద్ర ఎమ్మెల్యే జి.మధుసూదన్‌రెడ్డి తండ్రి కృష్ణారెడ్డి ఇటీవల అనారోగ్యంతో మృతిచెందగా.. ఆదివారం చిన్నచింతకుంట మండలం దమగ్నాపురంలో నిర్వహించే దశదిన కర్మ కార్యక్రమానికి సీఎంతోపాటు పలువురు మంత్రులు హాజరు కానున్నారని ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి తెలిపారు. ఈ మేరకు శుక్రవారం దమగ్నాపురంలో అధికారులు హెలీప్యాడ్, పార్కింగ్ తదితర పనులను చేపట్టారు. బాంబు స్క్వాడ్ బృందం హెలీప్యాడ్ స్థలం వద్ద తనిఖీలు నిర్వహించగా.. ఎస్పీ జానకి పర్యవేక్షించారు. పనులు త్వరగా పూర్తిచేయాలని, పార్కింగ్‌కు ఇబ్బందులు కలగకుండా చర్యలు చేపట్టాలని సిబ్బందికి సూచించారు. అనంతరం కృష్ణారెడ్డి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డిని, కుటుంబ సభ్యులను పరామర్శించారు. కార్యక్రమంలో డీఎస్పీ వెంకటేశ్వర్లు, సీఐ రామకృష్ణ, ఎస్‌ఐ శేఖర్ తదితరులున్నారు.

# పెట్రోల్ బంకులో ఆకస్మిక తనిఖీలు



పెట్రోల్ శాంపిల్స్ సేకరిస్తున్న సివిల్ సప్లయ్ అధికారులు

**కల్వకుర్తి రూరల్:** మండలంలోని మార్చాల సమీపంలో ఉన్న పెట్రోల్ బంక్‌లో శుక్రవారం సివిల్ సప్లయ్, తూనికలు, కొలతల శాఖ అధికారులు ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. కల్వకుర్తి పట్టణానికి చెందిన ఆనంద్ అనే వ్యక్తి తన మోటారు బైక్‌లో సదరు బంకులో పెట్రోల్ పోయించుకున్నాడు. అయితే కొంతదూరం వెళ్లాక వాహనం ఆగిపోవడంతో అనుమానం వచ్చి తిరిగి బంకు వద్దకు చేరుకున్నాడు. పెట్రోల్‌లో కల్తీతోపాటు నీళ్లు వచ్చాయని ఆరోపిస్తూ ఆందోళన చేపట్టాడు. అయితే బంకు యజమానులు దురుసుగా సమాధానం చెప్పడంతో గురువారం సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేయడంతో తనిఖీలు నిర్వహించారు. అనంతరం సివిల్ సప్లయ్ జిల్లా అధికారి శ్రీనివాస్ మాట్లాడుతూ బంకులో శాంపిల్స్ సేకరించి హైదరాబాద్‌లోని ల్యాబ్‌కు పంపిస్తున్నట్లు చెప్పారు. వినియోగదారులకు నాణ్యమైన పెట్రోల్, డీజిల్ అందే విధంగా బంకుల యజమానులు చర్యలు తీసుకోవాలని సూచించారు. తనిఖీల్లో తూనికలు, కొలతల అధికారి హైదర్‌అలీ, డీటీ రాఘవేందర్, సీఐ నాగార్జున తదితరులు పాల్గొన్నారు.

# చిన్నపాటి కారణాలకే ఆత్మహత్యకు పాల్పడొద్దు



మాట్లాడుతున్న ఇన్‌చార్జ్ డీఎంహెచ్‌ఓ శ్రీనివాసులు

**నాగర్‌కర్నూల్ క్రైం:** చిన్నపాటి కారణాలకే ఆత్మహత్య చేసుకోవడం సరికాదని, చెప్పిన సలహాలు, సూచనలు పాటిస్తూ విలువైన జీవితాన్ని కాపాడుకొని భావి భారత పౌరులుగా ఎదిగి.. కుటుంబానికి, సమాజానికి తోడ్పాటు అందించాలని ఇన్‌చార్జ్ డీఎంహెచ్‌ఓ శ్రీనివాసులు అన్నారు. జిల్లాకేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు ఆత్మహత్యల నివారణ దినోత్సవంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ దేశంలో యువత ఎక్కువగా మానసిక ఒత్తిడితో చిన్నపాటి కారణాలకే ఆత్మహత్యకు పాల్పడుతున్నారన్నారు. ప్రతి సమస్యకు ఒక పరిష్కారం ఉంటుందని, దాన్ని అవలంభించి సమస్యల నుంచి బయటపడాలి తప్ప ఆత్మహత్యలకు పాల్పడకూడదన్నారు. ప్రతిఒక్కరు మానసికంగా దృఢంగా ఉంటే సమస్యలను అధిగమిస్తూ పురోగతి సాధిస్తారన్నారు. ఏమైనా సమస్యలు ఉంటే టోల్‌ఫ్రీ నం.14416 కాల్ చేసి పరిష్కారం పొందవచ్చని చెప్పారు. ప్రతిఒక్కరు బాధ్యతగా వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత పాటించినట్లయితే సీజనల్ వ్యాధుల బారినపడకుండా ఆస్కారం ఉంటుందన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్‌ఓ వెంకటదాసు, ప్రోగ్రాం అధికారి కృష్ణమోహన్, కళాశాల ప్రిన్సిపల్ కమర్ షాజహాన్ సుల్తానా తదితరులు పాల్గొన్నారు.

## క్లుప్తంగా

### పాముకాటుతో వ్యక్తి మృతి



వెంకయ్య(ఫైల్)

తెలకపల్లి: పాముకాటుకు గురై ఓ వ్యక్తి మృతిచెందిన సంఘటన మండలంలో చోటుచేసుకుంది. కుటుంబ సభ్యులు గ్రామస్తులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మండల పరిధిలోని గౌరారానికి చెందిన పి.వెంకయ్య(46) పాముకాటుకు గురయ్యాడు. గురువారం తన పొలంలో పనిచేస్తూ.. కొద్దిసేపు చెట్టుకింద పడుకున్నాడు. అంతలోనే చేతికి ఏదో కాటు వేసినట్లు అనిపించడంతో వెంటనే లేచి చూశాడు. అప్పటికీ ఏమీ కనిపించలేదు. పాముకాటుకు గురైనట్లు నిర్ధారించుకుని భార్య ఊళ్లోకి తీసుకొచ్చింది. అప్పటికే పరిస్థితి విషమించింది. అంబులెన్స్‌లో నాగర్‌కర్నూల్ ఏరియా ఆస్పత్రికి చికిత్స నిమిత్తం తరలించారు. వైద్యులు పరిశీలించి అప్పటికే మృతిచెందినట్లు చెప్పారు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. శుక్రవారం అంత్యక్రియలు నిర్వహించారు.

### మద్యం తాగొద్దని చెప్పడంతో..

అమరచింత: మద్యం తాగొద్దని భార్య చెప్పడంతో క్షణికావేశానికి లోనైన ఓ వ్యక్తి ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మండలంలోని నందిమళ్ల గ్రామానికి చెందిన అంజిలన్న(45) కొంతకాలంగా మద్యానికి బానిసయ్యాడు. కుటుంబ పోషణ కోసం ఎలాంటి పనులు చేయకపోవడటంతోపాటు భార్య పద్మతో తరుచుగా గొడవ పెట్టుకునేవాడు. ఈ క్రమంలోనే గురువారం రాత్రి భార్యాభర్తల మధ్య వాగ్వాదం చోటుచేసుకోగా.. అర్ధరాత్రి సమయంలో ఫ్యాన్‌కు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. గమనించిన కుటుంబ సభ్యులు ఆత్మకూర్ ఆస్పత్రికి తీసుకెళ్లగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. ఈ ఘటనపై అంజిలన్న భార్య పద్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ సురేష్ తెలిపారు.

### కుమారుడితో సహా తల్లి అదృశ్యం

ఆత్మకూర్: ఆస్పత్రికి వెళ్తానని చెప్పి ఇంటి నుంచి కుమారుడితో సహా వెళ్లిన ఓ మహిళా కనిపించకుండా పోయిన సంఘటన ఆత్మకూర్‌లో చోటుచేసుకుంది. ఎస్‌ఐ నరేందర్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.
మండల పరిధిలోని తిప్డంపల్లికి చెందిన ఎర్రగట్టన్న కుమార్తె సునితను, కొంకనివానిపల్లికి చెందిన ఆంజనేయులుకు ఏడేళ్ల కిందట ఇచ్చి వివాహం చేశారు. వీరికి రాకేష్, నిషాంత్ ఇద్దరు కుమారులు ఉన్నారు. రాఖీ సందర్భంగా తల్లిగారింటికి వచ్చిన సునిత, భార్యాభర్తల మధ్య కుటుంబ కలహాలు ఉండటంతో అక్కడే ఉండిపోయింది. 12న గురువారం ఆత్మకూర్‌లోని ఆస్పత్రికి వెళ్లి వస్తానని చిన్న కుమారుడు నిషాంత్‌ను తీసుకెళ్లింది. రాత్రి వరకు రాకపోవడంతో బంధువుల ఇంటి వద్ద ఆరా తీశారు. సునిత తండ్రి ఎర్రగట్టన్న శుక్రవారం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో మిస్సింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలియజేశారు. వివరాలు తెలిసిన వారు ఆత్మకూర్ పోలీసులకు 87126 70631 సమాచారం ఇవ్వాలని కోరారు.

### 8 తులాల బంగారం చోరీ

- బీరువాల తాళాలు చేసే వ్యక్తిపై కేసు నమోదు

లింగాల: మండల కేంద్రంలోని ఇల్లెందుల శ్యాంసుందర్ ఇంట్లో గత నెల 26న జరిగిన చోరీలో 8 తులాల బంగారణం చోరీకి గురైనట్లు ఎస్‌ఐ జగన్‌మోహన్ శుక్రవారం తెలిపారు. పూర్తి వివరాలు ఇలా ఉన్నాయి. ఇంట్లో బీరువా తాళం సరిగా పడటంలేదు. దీంతో బీరువాలు బాగు చేసే బల్మూర్ మండలం గోదల్‌కు చెందిన వెంకటయ్యను ఇంటికి పిలిచి బీరువాను బాగు చేయించారు. గణేష్ పండుగ రోజు పూజ వద్ద బంగారం పెట్టి పూజ చెద్దామని అనుకొని బీరువాను చూడగా.. బంగారం కనిపించలేదు. బాధిత వ్యక్తి ఇచ్చిన ఫిర్యాదు మేరకు వెంకటయ్యపై కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు. బీరువాలు, తాళాలు బాగు చేస్తామని తిరిగే వ్యక్తుల గురించి ప్రజలు జాగ్రత్తగా ఉండాలని ఎస్‌ఐ తెలియజేశారు.

### ఆర్టీసీ బస్సు, కారు ఢీ



కొత్తకోట రూరల్: ఆర్టీసీ బస్సు, కారు ఢీకొన్న ఘటన శుక్రవారం సాయంత్రం కొత్తకోట సమీపంలో ఎన్‌హెచ్44పై చోటు చేసుకుంది. ఎస్‌ఐ మంజునాథ్‌రెడ్డి తెలిపిన వివరాల మేరకు.. మండలంలోని అమడబాకుల మోడల్ స్కూల్ నుంచి ఆర్టీసీ బస్సు విద్యార్థులను ఎక్కించుకుని కొత్తకోటకు వస్తుంది. మదర్‌థెరిస్సా జంక్షన్ వద్ద బస్సు కొత్తకోటకు మళ్లుతుండగా.. హైదరాబాద్ వైపు నుంచి కర్నూల్ వైపు వెళ్తున్న కారు డ్రైవర్ అతివేగంగా నడపడంతో బస్సు ఢీకొంది. బస్సులో ఉన్న విద్యార్థులకు ప్రమాదం జరగకపోవడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. ఆర్టీసీ కండక్టర్ సీహెచ్ రాములు ఫిర్యాదు మేరకు కారు డ్రైవర్ ప్రశాంత్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

# ప్రదర్శనశాలపై పట్టింపేది?



అలంపూర్ దేవాలయ ప్రాంగణంలోని పురావస్తు ప్రదర్శనశాల

- చరిత్రకు భాండాగారంగా అలంపూర్ మ్యూజియం
- ఇక్కడి విగ్రహాలు, శిలా శాసనాలకు దేశ విదేశాలలో గుర్తింపు
- సందర్శకులు లేక వెలవెలబోతున్న వైనం
- అభివృద్ధిపై దృష్టి సారిస్తామన్న కలెక్టర్



మ్యూజియంలోని పురాతన విగ్రహాలు, శాసనాలు

జోగుళాంబ శక్తిపీఠం: అలంపూర్ పురావస్తు ప్రదర్శనశాలలోని అనేక విగ్రహాలు, శిలా శాసనాలు నాటి చరిత్రకు నిలువెత్తు సాక్ష్యాలు. ఇక్కడి తవ్వకాల్లో బయట పడిన పలు విగ్రహాలు, శిలా శాసనాలు మ్యూజియంలో భద్రపర్చారు. ఇందులో 200 విగ్రహాలు, 26 శిలా శాసనాలు ఉన్నాయని మ్యూజియం సిబ్బంది చెబుతున్నారు. కానీ సందర్శకులు లేక వెలవెలబోతోంది. ఇక్కడి శిలాశాసనాలు, అద్భుత శిల్పాలు దేశ విదేశాల్లో ప్రదర్శింపబడి ప్రశంసలు అందుకున్నాయి.

**చరిత్రకు సాక్ష్యాలు..**

ఇక్కడ కనిపించే శాసనాలు, అద్భుతమైన విగ్రహాలు 7వ శతాబ్దం నుంచి 13వ శతాబ్దం నాటివి. ఆంధ్ర రాష్ట్ర ప్రాంతాన్ని పాలించిన రాజుల నిర్మాణ శైలి ఇక్కడ కనిపిస్తాయి. ఆదామి చాళుక్యుల్లోని 2వ పులకేశి పాలన నాటి శాసనాలతో పాటు వినయాదిత్యులు, విక్రమాదిత్యుడి శాసనాలు కూడా చూడవచ్చు. బౌద్ధమతం నాటి ఆనవాళ్లకు సంబంధించి ఆధారాలు ఉన్నాయి. ఇక్కడి శాసనాల గురించి రసరత్నాకరం, ఆనంద కందకం, డా. హీరానంద శాస్త్రి రచించిన 'ఏపీ గ్రఫీ ఆఫ్ ఇండికా ఏ గాడ్ టూ ఎలిఫింటా', అలాగే హెన్నీ కసిన్స్ రచించిన 'చాళుక్య ఆర్కిటెక్చర్'లో విపులంగా రాశారు. ఆర్కియాలాజికల్ ప్రముఖుల్లో ఒకరైన అబ్దుల్ వహీద్‌ఖాన్, ఎన్.రమేషన్ అభిప్రాయం ప్రకారం ఇక్కడి ప్రాంతాల్లో జరిపిన తవ్వకాల్లో 32 శాసనాలు లభించినట్లు తెలుస్తోంది. ప్రతాప రుద్రుడి శాసనం, 1527లో శ్రీకృష్ణ దేవరాయులు ఇక్కడికి వచ్చినట్లు శిలాశాసనాల్లో కనిపిస్తాయి. మ్యూజియంలోని నటరాజ, మహిషాసురమర్దిని, సూర్య తదితర విగ్రహాలు ఎంతో అద్భుతంగా ఉన్నాయి. రసనాథ సిద్ధులు ఇక్కడ ఉండి రసవిద్య ద్వారా బంగారు కూడా తయారు చేసినట్లు తెలుస్తోంది. 1521లో శ్రీకృష్ణ దేవరాయుడు రాయిచూరును జయించి అలంపూర్ ప్రాంతానికి వచ్చి ఇక్కడి బ్రహ్మేశ్వరుడు, యోగనారసింహస్వామి వారికి ఖడ్గం, ఉత్సవ విగ్రహాలు ఇచ్చినట్లు దాన శాసనాల ద్వారా తెలుస్తోంది.

**గుర్తింపు తీసుకొస్తాం..**



ఇటీవలే మ్యూజియాన్ని సందర్శించా. అద్భుతమైన విగ్రహాలు, విలువైన శాసనాలు అనేకం ఉన్నాయి. ఇక్కడ మ్యూజియం ఉన్నట్లు నాకే తెలియదు.. కనీసం సూచిక బోర్డులు కూడా లేవు. గుర్తింపునకు తగిన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించాం. పాఠశాల స్థాయి నుంచే విద్యార్థులకు ఇక్కడి శాసనాలు, విగ్రహాల గురించి అవగాహన కల్పించాలి.
– బీఎం సంతోష్, కలెక్టర్, జోగుళాంబ గద్వాల

**ఎవరూ రావడం లేదు..**



రోజు ఆలయాలకు వందలాది మంది భక్తులు వస్తున్నారు. కానీ మ్యూజియానికి రావడం లేదు. వచ్చినా బయటి నుంచి ఏమిటని అడిగి అలాగే వెళ్తున్నారేగాని లోనికి రావడం లేదు.
– రవి, మ్యూజియం అటెండర్.అలంపూర్

**సూచిక బోర్డు ఏర్పాటు చేయిస్తాం..**



మ్యూజియం కూడా భక్తులు సందర్శించే విధంగా ఆకర్షణీయమైన సూచిక బోర్డును దేవస్థానం తరపున ఏర్పాటు చేస్తాం. ఆలయానికి వచ్చే భక్తులు మ్యూజియం కూడా సందర్శించేలా సిబ్బందితో ప్రచారం చేయిస్తాం. సందర్శనీయ స్థలాల బోర్డులో మ్యూజియం పేరు చేరుస్తాం.
– పురేందర్‌కుమార్, ఈవో, అలంపూర్ ఆలయాలు

**దృష్టి సారించని అధికారులు..**

మ్యూజియంపై సంబంధిత అధికారులు దృష్టి సారించడం లేదు. నిత్యం ఆలయాలకు వందలాది మంది భక్తులు వస్తున్నా.. మ్యూజియంను మాత్రం గుర్తించలేకపోతున్నారు. ఇందుకు ప్రధాన కారణం మ్యూజియాన్ని సూచించే పాత బోర్డు మూసుకుపోగా.. కొత్తది ఏర్పాటు చేయకపోవడమే. మ్యూజియంలోకి ప్రవేశానికి ఒక్కొక్కరికి రూ.10 టిక్కెట్ ధర నిర్ణయించారు. ఇద్దరు సిబ్బందిని నియమించారు. సెలవు దినాల్లో 50 మంది, మిగతా రోజుల్లో 10 నుంచి 20 మంది సందర్శకులు వస్తారు. నెలకు కనీసం రూ.8 వేల ఆదాయం కూడా రావడం లేదు. ఇక్కడి శిలాశాసనాల గురించి వివరించేందుకు ఎవరూ లేరనేది సందర్శకుల వాదన.



12వ శతాబ్దం నాటి శిలాశాసనం

# రాష్ట్రస్థాయి ఖోఖో పోటీల్లో విజేతగా నిలవాలి



ఉమ్మడి జిల్లా ఖోఖో జట్లతో అసోసియేషన్ ప్రతినిధులు

**హైదరాబాద్ తరలిన ఉమ్మడి జిల్లా ఖోఖో జట్లు**

మహబూబ్‌నగర్ క్రీడలు: రాష్ట్రస్థాయి ఖోఖో పోటీల్లో ఉమ్మడి జిల్లా జట్లు విజేతగా నిలవాలని ఉమ్మడి జిల్లా ఖోఖో సంఘం కార్యదర్శి జీఏ.విలియం అన్నారు. హైదరాబాద్‌లోని మౌలాలిలో శుక్రవారం నుంచి ప్రారంభమైన రాష్ట్రస్థాయి సబ్ జూనియర్ ఖోఖో టోర్నీలో పాల్గొనే ఉమ్మడి జిల్లా బాల బాలికల జట్లు తరలివెళ్లాయి. ఈసందర్భంగా స్థానిక మాడ్రన్ స్కూల్ ఆవరణలో జిల్లా జట్లకు విలియం అభినందించారు. ఆయన మాట్లాడుతూ సమష్టిగా ఆడితే విజయం సాధించవచ్చని అన్నారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు దత్తు క్రీడాజట్లను పరిచయం చేసుకొన్నారు. రాష్ట్రస్థాయి ఖోఖో టోర్నీలో ప్రతిభ చాటాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఖోఖో సంఘం ఉపాధ్యక్షులు యూ.శ్రీనివాసులు, రమేష్ కుమార్, సంయుక్త కార్యదర్శులు మొగులాల్, రూప, మన్యం, చక్రవర్తి, వెంకటేశ్, కార్యనిర్వాహక కార్యదర్శి బాల్‌రాజు తదితరులు పాల్గొన్నారు.

# ఏషియన్ నెట్‌బాల్‌లో ప్రతిభ చాటాలి



క్రీడాకారిణులను అభినందిస్తున్న అదనపు కలెక్టర్ శివేంద్ర ప్రతాప్

మహబూబ్‌నగర్ క్రీడలు: త్వరలో జరిగే ఏషియన్ మహిళా నెట్‌బాల్ చాంపియన్‌షిప్‌లో క్రీడాకారిణులు మెరుగైన ప్రతిభ కనబరిచి దేశానికి పేరు ప్రతిష్టలు తీసుకురావాలని జిల్లా అదనపు కలెక్టర్ శివేంద్ర ప్రతాప్ అన్నారు. జిల్లా కేంద్రంలోని మెయిన్ స్టేడియంలో ఇండియన్ నెట్‌బాల్ కోచింగ్ క్యాంపులో పాల్గొన్న క్రీడాకారిణులను శుక్రవారం జిల్లా అదనపు కలెక్టర్ అభినందించి శాలువాలతో సత్కరించారు. అనంతరం క్రీడాకారులకు దుస్తులు అందజేశారు. కార్యక్రమంలో జిల్లా యువజన, క్రీడల అధికారి ఎస్.శ్రీనివాస్, నెట్‌బాల్ అసోసియేషన్ ఆఫ్ తెలంగాణ అధ్యక్షుడు విక్రం ఆదిత్యరెడ్డి, రాష్ట్ర కోశాధికారి సోహైల్ ఉర్ రహిమాన్ తదితరులు పాల్గొన్నారు.

# ఉత్సాహంగా జిల్లా అథ్లెటిక్స్ ఎంపికలు



అథ్లెటిక్స్ ఎంపికలను ప్రారంభిస్తున్న ప్రతినిధులు

మహబూబ్‌నగర్ క్రీడలు: జిల్లాకేంద్రంలోని మెయిన్ స్టేడియంలో శుక్రవారం జిల్లాస్థాయి అథ్లెటిక్స్ క్రీడాకారుల ఎంపికలు నిర్వహించారు. జిల్లావ్యాప్తంగా దాదాపు 300 మంది బాలబాలికలు హాజరయ్యారు. అండర్–14, 16 విభాగాలకు విభాగానికి 60 మీ., 600 మీ., లాంగ్‌జంప్, షాట్‌పుట్, హైజంప్, అండర్–18, 20 విభాగాలకు 100 మీ., 200మీ., 400మీ., 1000 మీ., డిస్కస్‌త్రో, జావెలిన్, షాట్‌పుట్, హైజంప్, లాంగ్ జంప్‌తో పాటు అండర్–20 విభాగానికి అదనంగా 1500 మీ., 3000 మీ., 5000 మీ., 10,000 మీ., క్రీడాంశాల్లో ఎంపికలు నిర్వహించారు. లయన్ ప్రసాద్, జిల్లా అథ్లెటిక్స్ సంఘం ప్రధాన కార్యదర్శి జి.శరత్‌చంద, కార్యనిర్వాహక కార్యదర్శి పుట్టి సురేషచందర్ ఎంపికలను ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో జిల్లా క్రీడాకారులు మెరుగైన ప్రతిభచాటి పతకాలు సాధించాలని ఆకాంక్షించారు. అసోసియేషన్ ప్రతినిధులు మాట్లాడుతూ హైదరాబాద్‌లోని ఉస్మానియా యూనివర్సిటీలో ఈ నెల 19, 20 తేదీల్లో రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీలు జరుగుతాయని తెలిపారు. జిల్లాస్థాయి ఎంపికైన క్రీడాకారుల వివరాలను త్వరలో ప్రకటిస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో కోచ్ ఆనంద్, సంయుక్త కార్యదర్శి సి.శ్రీనివాసులు, కార్యనిర్వాహక కార్యదర్శి పి.శ్రీనివాస్, పీడీలు రాజు, దత్తాత్రేయ, మేరి పుష్ప, ఎండి.మొయిన్ తదితరులు పాల్గొన్నారు.

# 'నిర్వాసితుల పక్షాన పోరాడుతా'



మాట్లాడుతున్న ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి

జడ్చర్ల: ఉదండాపూర్ నిర్వాసితుల పక్షాన తాను ప్రభుత్వంతోనైనా పోరాడుతానని ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి స్పష్టం చేశారు. శుక్రవారం దేవుని గుట్ట తండా సమీపంలో ఏర్పాటు చేస్తున్న ఉదండాపూర్ పునరావాస కేంద్రంలో అధికారులతో కలిసి నిర్వాసితులతో సమావేశమయ్యారు. ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ పెంచడానికి కృషి చేస్తామన్నారు. నిధుల కొరత అంటూ సాకులు చెబితే ఊరుకునేది లేదని అన్నారు. నిర్వాసితుల కోసం తాను ఎమ్మెల్యే కాక ముందు నుంచే పోరాడుతున్నానని గుర్తు చేశారు. తనది అధికార పక్షమైనా ప్రజల కోసం అవసరం అనుకుంటే తిరగబడతానని అన్నారు. ఇప్పటికే సమస్యలపై అసెంబ్లీలో మాట్లాడానని వివరించారు. ప్రభుత్వం సేకరించిన భూములకు 2016లో ఎకరానికి పరిహారంగా రూ.6.50 లక్షలు మాత్రమే ఇచ్చారని.. ఇప్పుడు కూడా అదే మొత్తాన్ని ఇవ్వడం సమంజసం కాదన్నారు. ఉదండాపూర్ రిజర్వాయర్ పూర్తయితే 8 లక్షల ఎకరాలకు సాగు నీరు అందే అవకాశం ఉందన్నారు. ఇంతటి ప్రాముఖ్యత కలిగిన ఈ రిజర్వాయర్‌కు ప్రభుత్వం ప్రాధాన్యత ఇవ్వాల్సిన అవసరం ఉందన్నారు. గత బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో మేడిగడ్డ ప్రాజెక్ట్ అంచనా వ్యయాన్ని రూ.30 వేల కోట్లు పెంచిందని అప్పుడే ఉదండాపూర్ నిర్వాసితుల సమస్యలు పట్టించుకుని ఉంటే ఇప్పుడీ పరిస్థితి ఉండేది కాదన్నారు. ముంపునకు గురవుతున్న వల్లూరు, ఉదండాపూర్ గ్రామాలతో పాటు 7 తండాలకు చెందిన ప్రజల తరఫున ముందుండి పోరాడుతానని వివరించారు. త్వరలోనే అధికారులతో కలిసి పర్యటిస్తామని పేర్కొన్నారు. రీ సర్వే నిర్వహించి తప్పులను సరిచేస్తామని తెలిపారు. ఈనెల 20న తమ తొలి పర్యటన ఉంటుందని అన్నారు. ఆర్‌అండ్‌ఆర్ పెంపునకు సంబంధించిన ఫైల్ పరిశీలనలో ఉందని అధికారులు చెబుతున్నారని .. మరో పది రోజుల్లో దీనిపై నిర్ణయం వెలువడే అవకాశం ఉందంటున్నారని పేర్కొన్నారు. ఆరు మాసాలు వేచి చూద్దామన్నారు. నిర్వాసితులకు ఎలాంటి అనుమానాలు అవసరం లేదని అందరు తమకు సహకరించాలని కోరారు. సమావేశంలో స్పెషల్ కలెక్టర్ ముకుంద రెడ్డి, అదనపు కలెక్టర్ మోహన్‌రావు, ఇరిగేషన్ ఎస్ఈ శ్రీనివాస్, తహసీల్దార్ సత్యనారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

### ఎక్సైజ్ దాడుల్లో నల్లబెల్లం, వాహనం పట్టివేత



కల్వకుర్తి రూరల్: సార అరికట్టేందుకు కల్వకుర్తి ఎక్సైజ్ పోలీసులు విస్తృతంగా దాడులు నిర్వహిస్తున్నారు. శుక్రవారం వేకువజామున నిర్వహించిన దాడుల్లో తర్నికల్ తండాకు అక్రమంగా తరులుతున్న 70 బస్తాల నల్లబెల్లం, 40 కిలోల స్పటిక తోపాటు ఓ వాహనాన్ని ఎక్సైజ్ అధికారులు సీజ్ చేశారు. వెల్దండ మండలం సిలోనిబావి తండాకు చెందిన మునియా, తర్నికల్ తండాకు చెందిన వినోద్, గోపాల్‌కు ఈ బెల్లాన్ని సరఫరా చేస్తుండగా.. స్వాధీనం చేసుకున్నామన్నారు. బెల్లం తరలిస్తున్న వాహనంలో 10 లీటర్ల సారను స్వాధీనం చేసుకుని నలుగురిపై కేసు నమోదు చేశారు. వీటి విలువ రూ.12 లక్షలు ఉంటుందని ఎక్సైజ్ సీఐ జిల్లెల్ల వెంకట్‌రెడ్డి విలేకరులకు తెలియజేశారు. దాడుల్లో సిబ్బంది నారియా, పరశురాం, భిక్షపతి, నజీర్, భీమమ్మ, జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

# రైల్వే డబ్లింగ్ పనులకు భూ సర్వే



బలుసుపల్లి శివారులో డబ్లింగ్ పనుల కోసం భూ సర్వే చేస్తున్న అధికారులు

దేవరకద్ర: కాచిగూడ నుంచి మహబూబ్‌నగర్ వరకు ఇప్పటికే డబ్లింగ్ పనులు పూర్తయి రెండు లైన్ల ద్వారా రైళ్ల రాకపోకలు సాగిస్తున్నాయి. అదే విధంగా మహబూబ్‌నగర్ నుంచి డోన్ వరకు రెండో విడత డబ్లింగ్ పనులకు రైల్వే పనులు చేపట్టడానికి అధికారులు భూ సర్వే ప్రారంభించారు. శుక్రవారం దేవరకద్ర మండల శివారులోని వెంకటాయపల్లి నుంచి బల్సుపల్లి, దేవరకద్ర వరకు డబ్లింగ్ పనుల కోసం కావాల్సిన భూ సేకరణ సర్వే చేపట్టారు. ప్రస్తుతం ఉన్న రైల్వే ట్రాక్ నుంచి కొత్తగా వేసే రైల్వే ట్రాక్ కోసం ఎంత మేర అవసరం ఉంటే ఆ మేరకు గుర్తులు వేస్తున్నారు. రైల్వే శాఖ అధికారులు రవి, బి.శ్రీనివాస్ రిటైర్డ్ జాయింట్ కలెక్టర్‌తో పాటు సర్వేయర్ టీం నరేందర్, వెంకటేశ్, చిరంజీవి, ఆర్‌ఐ శరత్ భూ సర్వేలో పాల్గొన్నారు. ప్రస్తుతం ఉన్న ట్రాక్ పక్కన మరో ట్రాక్ వేయడానికి కొన్ని చోట్ల 8 మీటర్ల మేర అవసరం ఉండగా.. మరికొన్ని చోట్ల 15 మీటర్ల వరకు అవసరం అవుతుంది. ఈ మేరకు హద్దులు గుర్తిస్తున్నట్లు సర్వే బృందం అధికారులు తెలిపారు. దేవరకద్ర పట్టణంలో కూడా రైల్వే ట్రాక్ పక్కన ఉన్న ఇళ్లు కొంతవరకు పోయే అవకాశం ఉందని తెలిపారు. దేవరకద్ర పరిధిలోని పుట్టపల్లి శివారు వరకు సర్వే పూర్తయిన తరువాత కౌకుంట్ల మండల పరిధిలో సర్వే ప్రారంభం అవుతుందన్నారు.

# అనుమానాస్పద స్థితిలో రైతు మృతి

**విద్యుదాఘాతంతో మృతిచెందినట్లు చిత్రీకరించారని మృతుడి తండ్రి ఆరోపణ**



నర్సింహులు (ఫైల్)



ఘటనా స్థలంలో వివరాలు సేకరిస్తున్న పోలీసులు

మల్దకల్: సీడ్‌పత్తి పంట పొలానికి నీరు పారించేందుకు వెళ్లిన ఓ రైతు అనుమానాస్పద స్థితిలో మృతిచెందాడు. ఈ ఘటన మల్దకల్ మండలం మద్దెలబండ గ్రామ సమీపంలో శుక్రవారం చోటు చేసుకుంది. స్థానికుల వివరాల మేరకు.. మద్దెలబండకు చెందిన బోయ జక్కిడిబావి నర్సింహులు (35) తనకు ఉన్న మూడెకరాల పొలంతో పాటు మరో రెండెకరాల వ్యవసాయ పొలాన్ని కౌలుకు తీసుకుని పత్తి పంటను సాగుచేశాడు. రోజులాగే గురువారం పత్తి పంటకు నీరు పారించేందుకు పొలానికి వెళ్లాడు. ఉదయం పంట పొలానికి వెళ్లిన అతడి భార్య పద్మమ్మకు పొలంలో నర్సింహులు కనిపించక పోవడంతో కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చింది. అందరూ కలిసి వెతకగా.. పొలం సమీపంలోని విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ వద్ద మృతిచెంది కనిపించాడు. విషయం తెలుసుకున్న ఏఎస్ ఈశ్వరయ్య ఘటనా స్థలానికి చేరుకుని వివరాలను సేకరించారు. గద్వాల సీఐ నాగేశ్వర్‌రెడ్డి క్లూస్‌టీం సహాయంతో దర్యాప్తు చేపట్టారు. కాగా, పొలం వద్ద గుర్తు తెలియని వ్యక్తులు నర్సింహులుపై దాడిచేసి హతమార్చారని.. మృతదేహాన్ని ట్రాన్స్‌ఫార్మర్ వద్ద వేసి విద్యుదాఘాతంతో మృతిచెందినట్లు చిత్రీకరించినట్లు మృతుడి తండ్రి పెద్ద నర్సింహులు పోలీసులతో ఆవేదన వ్యక్తంచేశారు. తండ్రి ఫిర్యాదు మేరకు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసినట్లు ఏఎస్ఐ ఈశ్వరయ్య తెలిపారు. మృతుడికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు.

**నాగర్‌కర్నూల్‌లో మరో యువకుడు..**

నాగర్‌కర్నూల్ క్రైం : అనుమానాస్పద స్థితిలో యువకుడు మృతిచెందిన ఘటన జిల్లాకేంద్రంలోని ఓంనగర్‌కాలనీలో శుక్రవారం చోటుచేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. జిల్లాకేంద్రానికి చెందిన సాయినాథ్ శర్మ (27) తన తల్లితో కలిసి ఓంనగర్ కాలనీలో నివాసం ఉంటున్నాడు. అనుమానాస్పద స్థితిలో ఇంట్లో ఫ్యాన్‌కు ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. గమనించిన తల్లి వనజకుమారి పోలీసులకు సమాచారం అందించడంతో వారు ఘటన స్థలాన్ని పరిశీలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జనరల్ ఆస్పత్రికి తరలించారు. సాయినాథ్ కాళ్లు కట్టేసి ఉండటంతో పాటు ఘటన స్థలంలో అనుమానాస్పదస్థితిలో ఉండడంతో.. ఆత్మహత్యనా? హత్యనా అని పోలీసులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. ఎస్‌ఐ గోవర్ధన్‌ను వివరణ కోరగా సాయినాథ్ మానసిక స్థితి బాగాలేకపోవడంతోనే ఆత్మహత్యకు పాల్పడ్డాడని ఫిర్యాదు అందినట్లు.. ఈమేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు వివరించారు.

# జూరాలకు స్వల్పంగా వరద



దిగువ జూరాలలోని స్విచ్ యార్డు



పూర్తిస్థాయి నీటి మట్టంతో జూరాల ప్రాజెక్టు

ధరూరు/ దోమలపెంట/ ఆత్మకూర్: జూరాల ప్రాజెక్టుకు ఎగువ నుంచి ఇన్‌ఫ్లో మరింత తగ్గుముఖం పట్టినట్లు పీజేపీ అధికారులు తెలిపారు. శుక్రవారం రాత్రి 9 గంటలకు 71 వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తుండగా.. ప్రాజెక్టు 6 గేట్ల ద్వారా 24,996 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేశారు. అలాగే విద్యుత్ ఉత్పత్తి నిమిత్తం 38,895 క్యూసెక్కులు, నెట్టెంపాడు ఎత్తిపోతల ద్వారా 750, ఎడమ కాల్వకు 730, కుడి కాల్వకు 620 క్యూసెక్కులు వదలగా.. మరో 94 క్యూసెక్కులు ఆవిరైంది. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 9.657 టీఎంసీలు కాగా ప్రస్తుతం 9.357 టీఎంసీల నీరు నిల్వ ఉంది. ఇదిలా ఉండగా.. నారాయణపూర్ ప్రాజెక్టుకు వరద ప్రవాహం స్వల్పంగా కొనసాగుతుంది. ప్రాజెక్టుకు 30 వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉండగా.. 2 గేట్ల ద్వారా 11,800 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 37.64 టీఎంసీలు కాగా.. ప్రస్తుతం 32.937 టీఎంసీల నీరు నిల్వ ఉంది.

**298 మి.యూ., విద్యుదుత్పత్తి**

జూరాల దిగువ, ఎగువ జల విద్యుత్ కేంద్రాల్లో విద్యుదుత్పత్తి కొనసాగుతుందని ఎస్ఈలు సురేష్, సూరిబాబు తెలిపారు. ఎగువలో 5 యూనిట్ల ద్వారా 195 మెగావాట్లు, దిగువలో 6 యూనిట్ల ద్వారా 240 మెగావాట్ల విద్యుదుత్పత్తి చేపట్టామన్నారు. ఆయా కేంద్రాల్లో కలిపి ఇప్పటి వరకు 298.327 మిలియన్ యూనిట్ల విద్యుదుత్పత్తి సాధించామని వివరించారు.

**శ్రీశైలం ఆనకట్ట గేట్ల మూసివేత**

జూరాల, సుంకేసుల నుంచి వస్తున్న నీటి ప్రవాహం తగ్గుముఖం పట్టడంతో శ్రీశైలం ఆనకట్ట వద్ద ఎత్తి ఉంచిన ఒక్క గేటును శుక్రవారం తెల్లవారుజామున మూసివేశారు. ప్రస్తుతం శ్రీశైలం జలాశయంలో 884.3 అడుగుల వద్ద 211.457 టీఎంసీల నీటి నిల్వ ఉంది. జూరాల, సుంకేసుల నుంచి కలిపి 76,152 క్యూసెక్కుల నీటి ప్రవాహం శ్రీశైలానికి వస్తుంది. దీంతో శ్రీశైలం భూగర్భ కేంద్రంలో విద్యుదుత్పత్తి చేస్తూ 37,116 క్యూసెక్కులు, ఏపీ జెన్‌కో పరిధిలోని కుడి గట్టు కేంద్రంలో ఉత్పత్తి చేస్తూ 30,824 మొత్తం 67,940 క్యూసెక్కుల నీటిని దిగువన సాగర్‌కు విడుదల చేస్తున్నారు. 24 గంటల వ్యవధిలో పోతిరెడ్డిపాడు ద్వారా 25 వేల క్యూసెక్కులు, ముచ్చుమర్రి, మల్యాల ఎత్తిపోతల నుంచి హెచ్ఎన్ఎస్ఎస్‌కు 1,420 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. ఎంజీకేఎల్ఐకి నీటి విడుదల చేయలేదు.

## అదుపుతప్పి బస్సును ఢీ కొట్టిన కంటెయినర్

**ఏడుగురు దుర్మరణం**

- అదే సమయంలో బస్సును ఢీ కొట్టిన మరో లారీ
- చిత్తూరు జిల్లా మొగిలి ఘాట్‌లో ఘోర రోడ్డు ప్రమాదం
- మృతుల్లో తెలంగాణవాసి
- 31 మందికి గాయాలు, 9 మంది పరిస్థితి విషయం



**ప్రమాద ధాటికి నుజ్జునుజ్జు అయిన బస్సు, లారీ**

**పలమనేరు:** ఘాట్ రోడ్‌లో అదుపు తప్పిన కంటెయినర్ మృత్యువాహనమైంది. డీజిల్ ఆదా కోసం ఆ కంటెయినర్ డ్రైవర్ చేసిన పని నడి రోడ్డుపై రక్తాన్ని ఏరులై పారించింది. శుక్రవారం చిత్తూరు జిల్లా పలమనేరు సమీపంలోని మొగిలి ఘాట్ రోడ్డులో ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. ఈ ప్రమాదంలో ఏడుగురు అక్కడిక్కడే మృత్యు ఒడికి చేరుకున్నారు. మరో 31 మంది గాయపడగా.. వారిలో 9 మంది పరిస్థితి విషమంగా ఉంది. బెంగళూరు నుంచి ఓ కంటెయినర్ సుమారు 100 టన్నుల ఇనుప కమ్మీలతో చెన్నైకి బయలుదేరింది. మొగిలి ఘాట్ పల్లంగా ఉండటంతో డీజిల్ ఆదా కోసం డ్రైవర్ వాహనాన్ని న్యూట్రల్ చేశాడు. లారీ 100 కి.మీ. పైగా వేగంగా వెళుతుండగా బ్రేక్ ఫెయిల్ అయ్యింది. దీంతో లారీ అదుపుతప్పి డివైడర్‌ని దాటి చిత్తూరు–బెంగుళూరు రోడ్డుపైకి దూసుకెళ్లింది. ఇదే సమయంలో తిరుమల నుంచి బెంగళూరుకు 52 మంది ప్రయాణికులతో వెళుతున్న అలిపిరి డిపోకు చెందిన ఏపీఎస్ ఆర్టీసీ బస్సును వేగంగా ఢీ కొట్టింది. ఆ వేగానికి బస్సు వెనక్కి తిరిగిపోయింది. అదే సమయంలో బస్సు వెనుక వస్తున్న మరో లారీ ఆ బస్సును బలంగా ఢీకొంది. ఈ ప్రమాదంలో ఏడుగురు అక్కడిక్కడే మృతి చెందారు. కొందరు బస్సులోనే నుజ్జు నుజ్జయి ప్రాణాలు విడిచారు. మరి కొందరు కంటెయినర్‌లోని ఇనుప కమ్మీలు కిందపడి ప్రాణాలు కోల్పోయారు. మరణించిన వారిలో ముగ్గురి శరీర భాగాలు గుర్తుపట్టలేనంతగా ఛిద్రమయ్యాయి. ప్రమాద సమయంలో బైక్‌పై వెళ్తున్న యువకుడు రెండు వాహనాల మధ్య ఇరుక్కుపోయి తీవ్ర గాయాల పాలయ్యాడు. మరణించిన వారిలో తెలంగాణ రాష్ట్రానికి చెందిన బల్లరాజు(55) ఉన్నారు.



పిఠాపురంలో భారీగా హాజరైన జనసందోహానికి వైఎస్ జగన్ అభివాదం

**నిన్న బుడమేరు.. నేడు ఏలేరు**

# నిర్లక్ష్యమే ముంచేసింది

**ఇది ఏమాత్రం బాధ్యత లేని ప్రభుత్వం ● ఏలేరు వరద ప్రాంతాల పర్యటనలో వైఎస్ జగన్ ధ్వజం**

**సాక్షి ప్రతినిధి, కాకినాడ:** వరదల నియంత్రణలో రాష్ట్ర ప్రభుత్వం దారుణంగా విఫలమైందని.. వరద హెచ్చరికలను పెడచెవిన పెట్టి విజయవాడను ముంచేసిన మాదిరిగానే ఏలేరు వరద విషయంలో అత్యంత నిర్లక్ష్యంగా వ్యవహరించి రైతుల నోట్లో మట్టి కొట్టిందని మాజీ సీఎం, వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నిప్పులు చెరిగారు. రాష్ట్రంలో ఒక బాధ్యత లేని ప్రభుత్వం ఉందని మండిపడ్డారు. ఏలేరు రిజర్వాయర్‌కు వరద వస్తుందని, అది ప్రమాదకర స్థాయిలో ఉంటుందని ప్రభుత్వానికి ముందే సమాచారం అందినా కాలువ ద్వారా నీటిని వదలకుండా తాత్సారం చేసి చివరకు సామర్థ్యానికి మించి వదిలి ముంచేశారని ధ్వజమెత్తారు. ఇరిగేషన్, రెవెన్యూ, హోంశాఖలతో కనీసం సమీక్షించకుండా సీఎం చంద్రబాబు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించారని మండిపడ్డారు. విజయవాడ ఎలా అతలాకుతలమైందో అలాంటి నిర్లక్ష్యమే ఏలేరు విషయంలోనూ కనిపిస్తోందన్నారు. పిఠాపురం నియోజకవర్గంలోని ఏలేరు వరద ప్రభావిత ప్రాంతాల్లో వైఎస్ జగన్ శుక్రవారం పర్యటించారు. మాధవాపురం, పాత ఇసుకపల్లి, నాగులాపల్లి, రమణక్కపేట తదితర గ్రామాల్లో దెబ్బతిన్న పంట పొలాలను పరిశీలించి రైతులను ఓదార్చారు. దెబ్బతిన్న ఇళ్లను పరిశీలించి బాధిత కుటుంబాలకు ధైర్యం చెప్పారు. అనంతరం రమణక్కపేటలో మీడియాతో మాట్లాడారు. ప్రీమియం చెల్లించకుండా ఉచిత పంటల బీమాను గాలికొదిలేసి రైతులను ప్రభుత్వం నట్టేట ముంచేసిందని దుయ్యబట్టారు. ఈ క్రాప్ నమోదు చేయడం లేదని, ఆర్బీకేలను అడ్రస్ లేకుండా చేశారని, సచివాలయాలను నిర్వీర్యం చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. చంద్రన్న వస్తాడు.. రూ.20 వేలు పెట్టుబడి సాయం ఇస్తాడన్న హామీ ఏమైందని నిలదీశారు. ఈ సందర్భంగా వైఎస్ జగన్ ఇంకా ఏమన్నారంటే..

**మనుషుల విలువ తెలిసి ఉంటే..**

ఏలేరు రిజర్వాయర్ దగ్గర పరిస్థితిని చూస్తే విజయవాడ గుర్తుకొస్తోంది. అతి భారీ వర్షాలు కురుస్తాయని ఆగస్టు 31నే రాష్ట్ర ప్రభుత్వాన్ని ఐఎండీ (భారత వాతావరణ విభాగం) అప్రమత్తం చేసింది. అలాంటి హెచ్చరిక అందగానే ప్రభుత్వం సమీక్ష నిర్వహించి ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలి. రెవెన్యూ, హోం, ఇరిగేషన్ కార్యదర్శులతో సమీక్ష చేయాలి. కానీ ముందే సమాచారం ఉన్నా ప్రభుత్వం పట్టించుకోలేదు. కలెక్టర్లతో మాట్లాడలేదు. సీఎస్ కూడా ఏమాత్రం పట్టించుకోలేదు. సీఎం చంద్రబాబుకు మానవత్వం ఉంటే, మనుషుల విలువ తెలిసి ఉంటే స్పెషల్ ఆఫీసర్‌ను నియమించి ఎప్పటికప్పుడు పరిస్థితి తెలుసుకుని ముందు జాగ్రత్తలు చేపట్టే వారు. కానీ అవేమీ చేయలేదు. అన్నీ గాలి కొదిలేశారు.

**సామర్థ్యానికి మించి ఒకేసారి నీటి విడుదలతో..**

ఏలేరు రిజర్వాయర్ సామర్థ్యం దాదాపు 24 టీఎంసీలు కాగా 31వతేదీ నాటికే సుమారు 18 టీఎంసీలు ఉన్నాయి. సెప్టెంబర్ 1న ఏలేరు రిజర్వాయర్‌కు 9,950 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వచ్చింది. ప్రభుత్వం జాగ్రత్త పడి ఉంటే, ఫ్లడ్ కుషన్ నిబంధన పాటించి ఉంటే ఆ మొత్తం వెంటనే కిందకు వదలాలి. ఎందుకంటే దిగువన కాలువ సామర్థ్యం 14 వేల క్యూసెక్కులు మాత్రమే. అలా అప్పుడే నీళ్ల దిగువకు వదిలి ఉంటే ఆ కాలువ పొంగకుండా ఉండేది. కానీ ప్రభుత్వం కేవలం 300 క్యూసెక్కులు మాత్రమే వదిలిపెట్టింది. సెప్టెంబరు 4న 5,400 క్యూసెక్కులు వస్తే బయటకు పంపింది కేవలం 300 క్యూసెక్కులు మాత్రమే. ఏమాత్రం ఫ్లడ్ మేనేజ్‌మెంట్ చేపట్టలేదు. ఫ్లడ్ ఫ్లో కుషన్ ఏర్పాటు చేయలేదు. పైనుంచి నీళ్లొస్తున్నా తీవ్ర నిర్లక్ష్యం వహించారు. కేవలం 300 క్యూసెక్కులు మాత్రమే వదులుతూ వచ్చారు. దీంతో 9వతేదీ నాటికి ఏలేరు రిజర్వాయర్ పూర్తిగా నిండింది. దీంతో గత్యంతరం లేక కిందకు 21,500 క్యూసెక్స్ వదిలారు. 10వ తేదీన 26,134 క్యుసెక్కుల ఇన్‌ఫ్లో ఉంటే ఏకంగా 27,275 క్యూసెక్స్ విడిచిపెట్టారు. అంటే కాలువ సామర్థ్యాన్ని మించి నీళ్లు వదలడంతో లోతట్టు ప్రాంతాలను ముంచెత్తింది. మరి ఇది కచ్చితంగా "మేన్ మేడ్ ఫ్లడ్" కాకపోతే మరేమిటయ్యా! అని అడుగుతున్నా. ప్రజలు పట్ల మానవత్వం చూపని, ఏమాత్రం బాధ్యత లేని ప్రభుత్వం ఇది. వరదలు వస్తే ఎలా హ్యాండిల్ చేయాలో కనీసం ఇంగితం లేని ప్రభుత్వం ఇది!

**ఏలేరు ఆధునీకరణపై అబద్ధాలు..**

అబద్ధాలు చెప్పడంలో సీఎం చంద్రబాబు గోబెల్స్‌కు తమ్ముడే. పచ్చి అబద్ధాలాడతారు. అబద్ధాలను సృష్టించడం, వాటిని అమ్మగలగడంలో చంద్రబాబును మించిన వారు ప్రపంచంలోనే లేరు. ఆయనకు వంత పాడే మీడియా నిత్యం అవే అబద్ధాలను ప్రచారం చేస్తోంది. ఏలేరు ఆధునికీకరణపైనా చంద్రబాబు అబద్ధాలు చెబుతున్నారు. తొలుత ఏలేరు కాలువ ఆధునికీకరణను 2008లో దివంగత వైఎస్సార్ రూ.138 కోట్లతో చేపట్టారు. ఆ తర్వాత ఎవరూ ఆ పనులను పట్టించుకోలేదు. వర్షాలు, నీళ్లు లేనప్పుడు మాత్రమే కెనాల్ ఆధునికీకరణ చేయగలం. లేదంటే క్రాప్ హాలిడే ప్రకటిస్తే కానీ సాధ్యం కాదు. 2014లో చంద్రబాబు సీఎం అయ్యాక అంచనాలు రూ.295 కోట్లకు పెంచడం మినహా పనులు చేయలేదు. నిజానికి అప్పుడు రిజర్వాయర్‌లో నీళ్లు కూడా పెద్దగా లేవు. నాడు చంద్రబాబు సీఎంగా ఉన్నప్పుడు ఏటా కరువే. చంద్రబాబు – కరువు ఇద్దరూ కవలలే. అప్పుడు వర్షాలు కూడా లేవు. అయినా పనులు ఎందుకు చేయలేదు? 2019లో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం వచ్చాక వరుసగా వర్షాలు కురవడంతో క్రాప్ హాలిడే ప్రకటించే పరిస్థితి లేకుండా పోయింది. దీంతో కాలువ ఆధునికీకరణ పనులు వేగంగా చేయలేకపోయాం.

**ఏం జరిగినా జగనే కారణం అంటాడు**

ఏలేరు వరదలపై ప్రభుత్వానికి ముందే ఇంత సమాచారం ఉన్నా తగిన జాగ్రత్తలు తీసుకోలేదు. ఫ్లడ్ కుషన్ మేనేజ్‌మెంట్‌లో చంద్రబాబు విఫలమై రైతులందర్నీ ఇబ్బంది పెట్టారు. వరదలు వస్తే రిజర్వాయర్లను ఎలా నిర్వహించాలో ఈ ప్రభుత్వానికి తెలియడం లేదు. చంద్రబాబు ప్రభుత్వం వచ్చి దాదాపు నాలుగు నెలలు అయింది. ఎక్కడ ఏం జరిగినా దానికి కారణం జగనే కారణం అంటాడు. విజయవాడలో వరదలు వచ్చినా జగనే కారణం.. ! ఏలేరు రిజర్వాయర్ కింద వరదలు వచ్చినా జగనే కారణం..! కోవిడ్ వచ్చినా జగనే కారణం.. అంటాడు! చంద్రబాబు చేయాల్సింది జగన్నామస్మరణ కాదు. ప్రతి దానికి జగన్‌పై అరవకుండా ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలి. ఇప్పటికైనా మమ్మల్ని నిందించడం మానుకుని ప్రజలకు క్షమాపణ చెప్పి నిజాయితీగా పాలన అందించాలి.

## సకాలంలో మెడికల్ కౌన్సెలింగ్ పూర్తి

**వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర**



**సాక్షి, హైదరాబాద్:** ఎంబీబీఎస్, బీడీఎస్ సీట్ల కౌన్సెలింగ్ కోసం ఎదురు చూ స్తున్న విద్యార్థులు, తల్లిదండ్రులు ఆందోళన చెందనక్కర్లేదని, వారం రోజుల్లో కౌన్సెలింగ్ ప్రారంభమవుతుందని వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ శుక్రవారం రాత్రి ఒక ప్రకటనలో వెల్లడించారు. మెడికల్ కౌన్సెలింగ్ కమిటీ ఇచ్చిన గడువులోగా ఎంబీబీఎస్ కౌన్సెలింగ్‌ను పూర్తి చేసి, తరగతులను ప్రారంభిస్తామని స్పష్టం చేశారు. ఈ విషయంలో ఎలాంటి వదంతులు, అసత్య ప్రచారాలను నమ్మొద్దని ఆయన విజ్ఞప్తి చేశారు. తెలంగాణ ప్రాంత విద్యార్థులకే సీట్లు దక్కాలన్నది తమ ఆలోచన అని, ఈ విషయంలో రాజీ పడేది లేదని పేర్కొన్నారు. వారం రోజుల్లో కౌన్సెలింగ్ ప్రారంభమవుతుందని, ఈలోగా వెబ్ ఆప్షన్ల నమోదు కోసం విద్యార్థులు సిద్ధంగా ఉండాలని మంత్రి సూచించారు. శనివారం ఉదయం 11 గంటల నుంచి రాష్ట్రంలోని ప్రభుత్వ, ప్రైవేటు కళాశాలల వివరాలు, సీట్ల వివరాలు యూనివర్సిటీ వెబ్‌సైట్‌లో (https://www.knruhs.telangana.gov.in/) అందుబాటులో ఉంటాయని వెల్లడించారు. గతేడాది ఏయే ర్యాంకు విద్యార్థులకు ఏయే కాలేజీల్లో సీట్లు వచ్చాయన్న వివరాలను కూడా వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచుతామని వివరించారు. ఆయా వివరాలను పరిశీలించి, తమ ర్యాంకులకు అనుగుణంగా వెబ్ ఆప్షన్ల కోసం జాబితాను సిద్ధం చేసుకోవాలని మంత్రి సూచించారు.

## ట్రాన్స్‌జెండర్ల కోసం జిల్లాకో క్లినిక్

**వైద్య ఆరోగ్యశాఖ కీలక నిర్ణయం**

**సాక్షి, హైదరాబాద్:** ట్రాన్స్‌జెండర్ల కోసం ప్రతి జిల్లాకో క్లినిక్‌ను ఏర్పాటు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ప్రస్తుతం ఉన్న జిల్లా ఆస్పత్రులు లేదా బోధన ఆస్పత్రుల్లోనే వీటిని ఏర్పాటు చేయనున్నారు. అవసరాన్ని బట్టి వారానికి రెండు లేదా మూడు రోజుల పాటు క్లినిక్స్ నిర్వహించనున్నారు. ప్రతి క్లినిక్‌లో జనరల్ ఫిజీషియన్, డెర్మటాలజిస్ట్, సైకియాట్రిస్ట్ అందుబాటులో ఉంటారు. అవసరాన్ని బట్టి గైనకాలజిస్ట్, యూరాలజిస్ట్, ఇతర స్పెషలిస్ట్ డాక్టర్లను డిప్యూట్ చేస్తారు. వైద్య ఆరోగ్యశాఖ, మహిళా శిశు సంక్షేమశాఖ సంయుక్తంగా ఈ క్లినిక్స్‌ను ఏర్పాటు చేస్తున్నాయి. ఇప్పటికే ఉత్తర్వులు కూడా జారీ చేశారు. తాము అనారోగ్యం బారిన పడ్డప్పుడు ఆస్పత్రులకు వెళ్లలేకపోతున్నామని, ఒకవేళ ధైర్యం చేసి వెళ్లినా అవమానాలు ఎదుర్కోవాల్సి వస్తోందని ట్రాన్స్‌జెండర్లు ఇటీవల ప్రభుత్వం దృష్టికి తీసుకొచ్చారు. ఆస్పత్రుల్లో తమకోసం ప్రత్యేకంగా ఓ రూమ్ కేటాయించాలని కోరారు. ఈ నేపథ్యంలోనే ప్రత్యేకంగా ట్రాన్స్‌జెండర్ల కోసం క్లినిక్స్ ఏర్పాటు చేయాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. అంతేకాదు, అవసరమైన వారికి జెండర్ మార్పిడి ఆపరేషన్లు కూడా ఉచితంగా చేయించనున్నారు. ఇందుకోసం కేంద్ర ఆరోగ్యశాఖ ఇటీవలే ఓ ప్రొసీజర్‌ను విడుదల చేసింది. తొలుత హార్మోనల్ బ్యాలన్స్ కోసం చికిత్స అందించడం, కౌన్సెలింగ్ ఇవ్వడం వంటివి చేసి, అప్పటికీ సెట్ అవ్వకపోతేనే జెండర్ మార్పిడి సర్జరీలు చేయాలని పేర్కొంది. ఇప్పటికే ఉస్మానియా ఆస్పత్రిలో ట్రాన్స్‌జెండర్ల కోసం క్లినిక్ నిర్వహిస్తున్నారు. ఇక్కడ ఉచితంగా ఆపరేషన్లు కూడా చేయడానికి అవసరమైన ఏర్పాట్లు చేశారు. జిల్లాల నుంచి రోగులను ఇక్కడికే రిఫర్ చేయనున్నారు.

## ట్రాఫిక్ నియంత్రణకు ట్రాన్స్‌జెండర్లు

▶ మొదటి పేజీ తరువాయి

ఈ విధులు అప్పగించాలని ముఖ్యమంత్రి సూచించారు. వలంటీర్లుగా పనిచేసే ట్రాన్స్‌జెండర్లకు ప్రతినెలా కొంత స్టైపెండ్ ఇవ్వాలని, దీంతో వారికి ఆర్థికంగా భరోసా కల్పించడంతో పాటు సమాజంలో గౌరవస్థానం కల్పించవచ్చునని సీఎం పేర్కొన్నారు. ఆసక్తిగా ఉన్న ట్రాన్స్‌జెండర్ల వివరాలను సేకరించాలని ముఖ్యమంత్రి అధికారులను ఆదేశించారు. వారం, పది రోజుల పాటు వారికి అవసరమైన ప్రత్యేక శిక్షణను కూడా అందించాలని, విధుల్లో ఉండే ట్రాన్స్‌జెండర్లకు ప్రత్యేక యూనిఫామ్ కూడా ఉండాలని అధికారులకు సూచించారు. శుక్రవారం సచివాలయంలో జీహెచ్ఎంసీ పరిధిలోని రోడ్లు, ఫుట్‌పాత్‌లు, ఇతర అభివృద్ధి పనులు, పారిశుద్ధ్యం తదితర అంశాలపై సమీక్షా సమావేశం సందర్భంగా సీఎం ఈ విషయం వెల్లడించారు. సీఎం నిర్ణయంతో ఈ కార్యక్రమం విజయవంతమైతే దేశంలో ఇతర నగరాలు కూడా దీనిని ఆదర్శంగా తీసుకునే అవకాశం ఉంది.

## మాజీ మంత్రి లక్ష్మారెడ్డికి పరామర్శ



**మాజీ మంత్రి లక్ష్మారెడ్డితో శాసనమండలి వైస్ చైర్మన్ బండ ప్రకాశ్ తదితరులు**

**జడ్చర్ల:** మాజీ మంత్రి సి.లక్ష్మారెడ్డి సతీమణి శ్వేతారెడ్డి అకాలమరణం చెందడంతో ఆయనను శాసనమండలి వైస్ చైర్మన్ బండప్రకాశ్ పరామర్శించారు. శుక్రవారం ఆయన హైదరాబాద్ నుంచి నేరుగా నాగర్‌కర్నూల్ జిల్లా తిమ్మాజీపేట మండలం ఆవంచలోని లక్ష్మారెడ్డి నివాసానికి చేరుకున్నారు. శ్వేతారెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం లక్ష్మారెడ్డితో కొద్దిసేపు మాట్లాడారు. అనంతరం ఆయన హైదరాబాద్‌కు తిరిగి వెళ్లారు. ఆయనతో పాటు ఆదిలాబాద్ మాజీ ఎంపీ వేణుగోపాలాచారి, దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు ఆల వెంకటేశ్వర్‌రెడ్డి, రాజేందర్‌రెడ్డి, మర్రి జనార్దన్ రెడ్డి, పైళ్ల శేఖర్‌రెడ్డి, మత్స్యశాఖ మాజీ చైర్మన్ సత్యనారాయణ తదితరులు సైతం లక్ష్మారెడ్డిని పరామర్శించిన వారిలో ఉన్నారు.

# సుఫియన్ ఇంటికి వచ్చేశాడు

- దుబాయ్‌కి వెళ్లి రష్యా యుద్ధంలో చిక్కుకున్న వైనం
- విదేశాంగ శాఖ చొరవతో క్షేమంగా వెనక్కి
- 9 నెలల తర్వాత ఇంటికి చేరుకోవడంతో కుటుంబీకుల ఆనందం
- యువకుడి పరిస్థితిపై 'సాక్షి'లో ప్రత్యేక కథనాలు




**'సాక్షి'లో ప్రచురితమైన కథనాలు**



**ఇంటికి చేరుకున్న సుఫియన్.. ఆనందంలో తల్లిదండ్రులు**

**నారాయణపేట:** దుబాయ్‌లో ఉద్యోగం కోసం వెళ్లి.. రష్యా– ఉక్రెయిన్ యుద్ధంలో చిక్కుపోయిన భారతీయ యువకుల్లో ఒకరైన తెలంగాణ రాష్ట్రం నారాయణపేట జిల్లా కేంద్రానికి చెందిన సుఫియన్ తొమ్మిది నెలల తర్వాత శుక్రవారం ఇంటికి క్షేమంగా చేరుకున్నాడు. పట్టణానికి చెందిన జహర్, నసీమా దంపతుల రెండో కుమారుడు సయ్యద్ మహమద్ సుఫియన్ జీవనోపాధి కోసం దుబాయ్ వెళ్లగా.. అక్కడ ఓ ఏజెంట్ మోసం చేసి రష్యా సైన్యంలో చేర్పించిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో సుఫియన్ దీన స్థితిపై 'సాక్షి'లో ప్రత్యేక కథనాలు ప్రచురితమయ్యాయి. స్పందించిన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సుఫియన్ వెనక్కి తీసుకురావడంలో సఫలమయ్యాయి. సుఫియన్ స్థానిక మీడియాతో మాట్లాడుతూ తనను వెనక్కి తీసుకురావడంలో చొరవ చూపిన ప్రధానమంత్రి నరేంద్రమోదీ, విదేశాంగ శాఖ మంత్రి జై శంకర్, సీఎం రేవంత్‌రెడ్డి, ఎంపీ అసదుద్దీన్ ఓవైసీ, ఎంపీ డీకే అరుణ, ఎమ్మెల్యే పర్ణికారెడ్డిలకు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు. సుఫియన్ ఎప్పుడు ఇంటికి తిరిగి వస్తారనే పది నెలలుగా ఎదురుచూస్తున్న కుటుంబం శుక్రవారం ఇంటికి రావడంతో ఆనందపడ్డారు. తల్లిదండ్రులు, సోదరుడు, చెల్లెళ్లు అతడిని చూసి కన్నీళ్లు పెట్టుకున్నారు.

**రష్యా టు ఇండియా**

ప్రధాని మోదీ రష్యా పర్యటనలో భాగంగా ఆ దేశ అధ్యక్షుడు పుతిన్‌ను రష్యా ఆర్మీలో భారతీయులు చిక్కుకున్నారని.. వారిని తిరిగి తమ దేశానికి పంపించాలని కోరగా సానుకూలంగా స్పందించారు. ప్రధాని మోదీ, విదేశాంగ మంత్రి ఎస్.జైశంకర్ చొరవతో రష్యా నుంచి దేశానికి సురక్షితంగా వచ్చామని బాధితులు చెబుతున్నారు. ఈ నెల 6న రష్యా ఆర్మీ నుంచి మాస్కోకు చేరుకున్నారు. ఆ తర్వాత శుక్రవారం తెల్లవారుజామున ఢిల్లీకి, మధ్యాహ్నం 2 గంటలకు హైదరాబాద్ విమానాశ్రయానికి వచ్చారు. అక్కడికి కుటుంబ సభ్యులు వెళ్లి సుఫియన్ నేరుగా నారాయణపేటకు తీసుకు వచ్చారు.

**ప్రాణాలు అరచేతిలో పెట్టుకొని బతికా..**

రష్యాలో హోటల్ పనిచేసేందుకు ఉద్యోగం ఇప్పిస్తానని ఓ బ్రోకర్ నమ్మించి మోసం చేశారు. నెల రోజుల పాటు శిక్షణ ఇచ్చి రష్యాకు 1,500 కిలోమీటర్ల దూరంలో ఉక్రెయిన్ సరిహద్దుకు దగ్గరలో వదిలిపెట్టారు. చేతికి తుపాకీ ఇచ్చి.. బార్డర్‌లో నిలబెట్టారు. 25 రోజుల పాటు మాకు ఫోన్ సౌకర్యం లేదు. ఆ తర్వాత ఒక రోజు కుటుంబ సభ్యులకు ఫోన్‌లో సమాచారం ఇచ్చాం. మీడియా ద్వారా రష్యాలో చిక్కుకున్న భారతీయ యువకుల సమాచారం బయటికి వచ్చింది. మమ్మల్ని ప్రాణాలతో తిరిగి వచ్చే వరకు పత్రికల్లో, మీడియాలో చూపించినందుకు ప్రత్యేక కృతజ్ఞతలు. – సుఫియన్, బాధిత యువకుడు

## నకిలీ పట్టాల వ్యవహారంలో ముగ్గురి అరెస్టు

- 523 సర్వే నంబర్‌లోని ప్రభుత్వ భూమిలో ప్లాట్లు చేసిన విక్రయించిన నిందితులు
- వీరికి కౌన్సిలర్ రాణి భర్త రాజు, శ్రీకాంత్‌గౌడ్ సహకారం
- వివరాలు వెల్లడించిన డీఎస్పీ వెంకటేశ్వర్లు

**మహబూబ్‌నగర్ క్రైం:** ఆదర్శనగర్‌లోని సర్వే నంబర్ 523లో ఉన్న భూమిని దొంగ పట్టాలు సృష్టించి ఒక్కో ప్లాట్ దగ్గర రూ.2 లక్షల నుంచి రూ.3 లక్షల వరకు వసూలు చేసిన వ్యక్తులను మహబూబ్‌నగర్ పోలీసులు అరెస్టు చేశారు. మహబూబ్‌నగర్ డీఎస్పీ వెంకటేశ్వర్లు కథనం ప్రకారం.. క్రిస్టియన్‌పల్లి సమీపంలోని ఆదర్శనగర్‌లోని సర్వే నంబర్ 523లో ఉన్న ప్రభుత్వ భూమిని కొందరు వ్యక్తులు ఇళ్లు నిర్మించుకోవడానికి సహకరించారని అర్బన్ తహసీల్దార్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు రూరల్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు. ఈ కేసులో నిందితుడు ఏ–1 రాయుడు, ఏ–2 దేవా కలిసి ప్రభుత్వ భూమిలో నకిలీ పత్రాలు సృష్టించి బాధితుల నుంచి డబ్బులు వసూలు చేసి విక్రయించారని, ఇళ్లు నిర్మించుకోవడానికి సహకరించారని విచారణలో తేలిందన్నారు. ఈ నేరం చేయడానికి క్రిస్టియన్‌పల్లి వార్డు కౌన్సిలర్ రాణి భర్త రాజు, శ్రీకాంత్‌గౌడ్ సైతం సహకరించారని విచారణలో నిందితులు ఒప్పుకున్నట్లు డీఎస్పీ వెల్లడించారు. ఏ–1 రాయుడు, ఏ–2 దేవా, ఏ–3 రాజులను అరెస్టు చేసి రిమాండ్ తరలించామని చెప్పారు. వీరి నుంచి నకిలీ ఇళ్ల పట్టాలు, అగ్రిమెంట్ పేపర్లు, కొన్ని జిరాక్స్ ఇళ్ల పట్టాలు, పట్టా తయారీకి ఉపయోగించే రెవెన్యూ అధికారుల ముద్ర, ప్రభుత్వ ముద్ర, బీఎండబ్ల్యూ కారు సీజ్ చేసినట్లు వివరించారు. ఈ కేసు ఇంకా విచారణ కొనసాగుతుందని తెలిపారు. ప్రజలు ఎవరూ ప్రభుత్వ భూమికి సంబంధించి పట్టాలు ఇస్తామని చెబితే మధ్యవర్తులు, దళారుల నమ్మి డబ్బులు ఇవొద్దన్నారు. సర్వే నంబర్ 523లో దొంగ పట్టా ద్వారా మోసపోయిన బాధితులు ఉంటే సరైన ఆధారాలతో రూరల్ పోలీస్‌స్టేషన్ ఫిర్యాదు చేయాలని సూచించారు.

## డయాలసిస్ విభాగం సందర్శన



**రికార్డులు పరిశీలిస్తున్న డాక్టర్ స్వర్ణలత**

**పాలమూరు:** జిల్లా జనరల్ ఆస్పత్రిలో ఉన్న డయాలసిస్ యూనిట్‌ను శుక్రవారం నిమ్స్ ఆస్పత్రి నెఫ్రాలజీ విభాగం హెచ్ఓడీ డాక్టర్ స్వర్ణలత బృందం సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె ఆస్పత్రిలో నిర్వహిస్తున్న డయాలసిస్ యూనిట్ మిషన్ల పనితీరు, ఆర్ఓ ప్లాంట్, రికార్డు పరిశీలన, డ్రగ్స్ అందుతున్న తీరు ప్రతి అంశాన్ని స్థానిక వైద్యుల ద్వారా అడిగి తెలుసుకున్నారు. సెంటర్ ఏర్పాటు చేసిన నాటి నుంచి ఇప్పటి వరకు అందిన వైద్య సేవలపై ఆరా తీశారు. ప్రస్తుతం ఎంత మంది బాధితులకు సేవలు అందిస్తున్నారో తెలుసుకున్నారు.ఈ కార్యక్రమంలో ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ సంపత్‌కుమార్ సింగ్, ఆర్ఎంవో శిరీష పాల్గొన్నారు.

## 'కమిటీల పేరుతో కాలయాపన చేయొద్దు'



**మాట్లాడుతున్న ఎమ్మార్పీఎస్ (టీఎస్) రాష్ట్ర అధ్యక్షుడు పాపన్న**

**మహబూబ్‌నగర్ రూరల్:** ఎస్సీ వర్గీకరణ అమలు విషయంలో రాష్ట్ర ప్రభుత్వం కమిటీల పేరుతో కాలయాపన చేయొద్దని ఎమ్మార్పీఎస్ (టీఎస్) రాష్ట్ర అధ్యక్షుడు పాపన్న అన్నారు. శుక్రవారం జిల్లాకేంద్రంలో నిర్వహించిన ముఖ్య నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎస్సీ వర్గీకరణపై సీఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలో కమిటీ వేయడం ఎంతో అభినందనీయమన్నారు. మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి చైర్మన్‌గా, దామోదర రాజనర్సింహ వైస్ చైర్మన్‌గా, సీతక్క, మల్లురవి, పొన్నం ప్రభాకర్‌లను నియమించడం శుభ పరిణామం అన్నారు. అయితే ఎస్సీ వర్గీకరణపై ఉషా మెహ్రా కమిషన్, రామచంద్రరావు కమిటీ పూర్తిగా మాదిగ, మాల ఉప కులాలను విడదీసి ఏబీసీడీలుగా వర్గీకరించాలని అప్పట్లోనే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు నివేదిక ఇచ్చాయని గుర్తుచేశారు. మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డిని ఎస్సీ వర్గీకరణపై కమిటీ వేసి చైర్మన్ సుప్రీంకోర్టులో రాష్ట్రాల పరిధిలో చేసుకోవచ్చని చెప్పి ఇప్పటికీ మూడు నెలలు కావొస్తుందని, రాష్ట్రంలో దొంగచాటుగా వివిధ శాఖలలో ఉద్యోగాల నియామకాలు చేసుకుంటున్నారని ఆరోపించారు. సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును అమలు చేసే వరకు రాష్ట్రంలో ఉద్యోగ నియామకాలు జరగకుండా చూడాల్సిన బాధ్యత సీఎం రేవంత్‌రెడ్డిపై ఉందన్నారు. 2000–2004 మధ్య 20 వేల ఉద్యోగాలు వచ్చాయని, ఎస్సీ వర్గీకరణ లేకపోవడంతో ఎంత నష్టపోతున్నామో ఒకసారి అర్థం చేసుకోవాలని కోరారు. జనాభా దమాషా ప్రకారం రాష్ట్రంలో 70 లక్షల మంది మాదిగలు ఉన్నారని, కానీ ఒక శాతం లేనోళ్లే రాష్ట్రంలో అభివృద్ధి చెందారని ఆరోపించారు. సమావేశంలో ఎమ్మార్పీఎస్ (టీఎస్) దక్షిణ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు శ్రీనివాస్, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ జంబులయ్య, రాష్ట్ర యువసేన అధ్యక్షుడు యాదగిరి, నాయకులు కృష్ణ, రమేష్, రాజు, యాదయ్య, అక్షయ్ తదితరులు పాల్గొన్నారు.

## ■ నేలకొరిగిన వందేళ్ల భారీ వృక్షం



**నెలకొరిగిన భారీ వృక్షం**

పట్టణంలోని టీచర్ కాలనీ సమీపంలో శుక్రవారం మధ్యాహ్నం వందేళ్ల భారీ వేప వృక్షం నేలకొరిగింది. అసమయంలో అక్కడ ఎవరు లేక పోవడంతో భారీ ప్రమాదం తప్పింది. ఒక బైక్ మాత్రం స్వల్పంగా ధ్వంసం అయింది. సమాచారం అందుకున్న మున్సిపల్ కమిషనర్ సునీత అక్కడికి చేరుకొని రోడ్డుపై పడిన చెట్టును పరిశీలించారు. సిబ్బందితో ఆ చెట్టును తొలించేలా చర్య లు తీసుకోవాలని సూచించారు. – నారాయణపేట

## 17న జిల్లాకేంద్రంలో మిలాద్ జులూస్

**స్టేషన్ మహబూబ్‌నగర్:** మిలాదున్నబీ వేడుకలను పురస్కరించుకొని జిల్లాకేంద్రంలో ఈనెల 17వ తేదీన మిలాద్ జులూస్ ఊరేగింపు ర్యాలీ నిర్వహిస్తున్నట్లు మజ్లిస్ అహ్లె సున్నత్‌వల్ జమాత్ మిలాద్ జులూస్ జిల్లా కమిటీ చీఫ్ ప్యాట్రన్ సయ్యద్ అబ్దుల్ రజాక్‌షా ఖాద్రీ, అధ్యక్షులు మజహర్ హుస్సేన్ షహీద్, ఉపాధ్యక్షులు రఫీక్ పటేల్, కార్యదర్శి అన్వర్‌పాష అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని షాసాబ్‌గుట్ట దర్గా ఆవరణలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. ఈ నెల 16న పట్టణంలో గణేశ్ నిమజ్జనం ఉండడం వల్ల.. 17వ తేదీన జులూస్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఆ రోజు అసర్ నమాజ్ అనంతరం సాయంత్రం 5 గంటలకు మిలాద్ జులూస్ ర్యాలీ మక్కా మసీద్ నుంచి ప్రారంభమవుతుందని, అనంతరం క్లాక్‌టవర్ నుంచి సామూహికంగా మున్సిపల్ కార్యాలయం, అశోక్‌టాకీస్, అంబేద్కర్ చౌరస్తా, న్యూటౌన్ మీదుగా షాసాబ్‌గుట్ట దర్గా ఆవరణకు చేరుకుంటుందన్నారు. అనంతరం దర్గా ఆవరణలో ధార్మిక సభ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఉత్తరప్రదేశ్‌కు చెందిన ప్రముఖ ధార్మికవేత్త మౌలానా నిసార్ అహ్మద్ ధార్మిక సందేశం ఇస్తారని పేర్కొన్నారు. సమావేశంలో ఎంఐఎం జిల్లా అధ్యక్షులు అబ్దుల్ హాదీ, వర్కింగ్ ప్రెసిడెంట్ అఫ్రోజ్‌షా, కమిటీ ప్రతినిధులు జఫర్‌షా, వాసిఫ్‌షా, మీర్ షోయబ్‌అలీ, తఖీ హుస్సేన్, తఖీయోద్దీన్, ఖుద్దూస్‌బేగ్, ఇలియాజ్ ముజాహిద్, జహంగీర్‌పాష ఖాద్రీ, ఇనాయతుల్లా హుస్సేని, అబ్దుల్లా సున్నీ పాల్గొన్నారు.



**మాట్లాడుతున్న అబ్దుల్ రజాక్‌షా ఖాద్రీ**